# కాలజ్ఞానసుధ


ఆధ్యాత్మిక మాస పత్రిక

అక్టోబరు - 2015 సంపుటి:19 సంచిక:10




## ఈ నెల సూక్తి

➢ ఇతరుల కొరకు ముళ్లు నాటకు. ఎందుకంటే నీదీ అదే దారి. ఏదో ఒకనాడు అవి నిన్నూ బాధపెడతాయి.



## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం - విస్తరించిన విశ్వశక్తి | 4 |
| దీనజన సేవ | 6 |
| మహాభారతంలోని నీతి కథలు | 8 |
| సర్వం శక్తిమయం జగత్ | 9 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (పాలక (రాజు) ధర్మములు) | 10 |
| పార్వతి తపస్సు | 12 |
| వేదపరిచయము | 14 |
| దేవీ విజయం | 17 |
| వీరకాళికాంబా శతకము | 20 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 21 |
| యోగవాసిష్ట కథాలహరి - లేడి - ఏనుగు- చేప-మిడత-తుమ్మెద | 24 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 26 |
| దారిదోచే మన్నేటి వెంకట | 29 |
| శ్రీరామ భక్తి (భరధ్వాజుని శ్రీరామభక్తి) | 31 |
| రఘువంశం | 32 |
| దర్శనీయ దేవాలయాలు - పింజరికొండ | 35 |
| వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు | 36 |
| వాస్తు- సైన్సు | 37 |


ముఖచిత్రం : శ్రీ గోవిందమాంబా మహాదేవి (కాళికాదేవి రూపం)


### చందా వివరములు

జీవిత చందా (20సం॥) : 1116/-

సంవత్సర చందా : 100/-



చందాలు పంప వలసిన చిరునామా:

**కాలజ్ఞాన సుధ**

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్: 08592/235341, 9949132469,
9705555229, 8977799289

సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# విస్తరించిన విశ్వశక్తి

అమ్మవారు ఈ విశ్వాన్ని సృజించి తాను విశ్వశక్తి అయినది. "సకలమునకు శక్తి - శాశ్వతాధారమై నిలుచునంచు బలికే నిగమతతులు"... అన్నారు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారు. స్వామి అమ్మవారిని గురించి కాళికాంబ సప్తశతిలో పలుచోట్ల ప్రస్తావించారు. వారు ఈ సృష్టికంతటికి స్త్రీయే మూలాధారమని చెప్పారు. "అదితి సర్వ సృష్టికాధారమనె ఋక్కు" అంటూ తాను రచించిన సప్తశతిలో మొదట పద్యము ద్వారా స్పష్టంగా చెప్పారు.

235. గాలిరీతి విశ్వగోళాలలో నుండు
దివుల భువులమధ్య తిరుగగలవు
నీవులేనిచోటు నిక్కమ్ముగా లేదు
కాళికాంబ! హంస! కాళికాంబ!

అంటూ ఈ విశ్వాంతరాళం అంతటా అమ్మవారె నిండియున్నదని అమ్మలేనిచోటే లేదని చెప్పారు. వివిధ రూపాల విస్తరించితివీవ! శ్రీ గోవిందమాంబ నుద్దేశించి స్వామివారు చెప్పారు. కందిమల్లయ్యపల్లెలో గోవిందమాంబవై, కాశీలో అన్నపూర్ణవై, కంచిలో కామాక్షివై, మధురలో మీనాక్షివై, బెజవాడలో కనకదుర్గవై, జొన్నవాడలో కామాక్షివై, అలంపూర్‌లో జోగులాంబవై ఆయా పుణ్యక్షేత్రాలలో ఆయా నామాలతో విరాజిల్లుతున్నది నీవెనమ్మా అని చెప్పారు స్వామి. అమ్మవారు ఒక్కరె! ఒకే అమ్మవారు వివిధ క్షేత్రాలలో వివిధ పేర్లతో పిలువబడుతూ, వివిధ రూపాలతో భక్తుల నుండి ధూపదీప నైవేద్యాలనందుకుంటున్నది.

తేది13-10-2015 నుండి తేది 22-10-2015 వరకు దేవీనవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలు భారతదేశమంతటాను, ఇతర దేశాలలోను మహాద్భుతంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలలో అమ్మవారు ఒక్కొక్క క్షేత్రంలో ఒక్కొ రూపంలో ఉంటుంది. విజయవాడలో కనకదుర్గమ్మవారికి నవరాత్రులు చేసేటప్పుడు ఒక్కొక్క రోజు ఒక్కొక్క అలంకారం చేస్తారు. తిరుపతిలో కాళహస్తిలోను తొమ్మిది లేదా పది రోజులు పది అలంకరాలతో సేవిస్తారు. కాని ఒక క్షేత్రానికి మరొక క్షేత్రానికి సంబంధం వుండదు. అంటే తిరుపతిలో అమ్మవారికి చేసే ప్రకారమే కాళహస్తిలో జరుగదు. ఎక్కడి కక్కడే వేరు వేరు పేరులతో అర్చనలు, ఆరాధనలు జరుగుతాయి. అందరూ తొమ్మిది రోజులు వస్తే తొమ్మిది రోజులు, పది రోజులు వస్తే పది రోజులు చేస్తారు. రోజుకోక అలంకారం చేస్తారు. ఒక క్షేత్రానికి మరొక క్షేత్రానికి సంబంధం వుండాలని ఏమిలేదు.

దాని సారాంశము ఏమిటంటే ఎవరికి నచ్చిన పద్ధతిలో వారు అమ్మను సేవించుకొనవచ్చు. మనం ఏ పేరుతో పిలిస్తే ఆమె ఆ పేరుతో పలుకుతుంది. మనలను అనుగ్రహిస్తుంది. కనుక వివిధ రూపాలలో వున్నది ఆ గోవిందమాంబయే! లేదా కనకదుర్గమాతయే! ఇంత మంది అమ్మవారులు లేరు. ఒక అమ్మే పలురూపాలలో వున్నది. ఈ భావన స్థిరం చేసుకొని అమ్మవారిని సేవించుకుంటే ఆయమ్మ సంపూర్ణ కరుణా కటాక్షాలు మనమీద వుంటాయి.

అమ్మవారి అనుగ్రహాన్ని పొందటానికి కావలసిన అర్హతను కూడా స్వామి 27వ పద్యంలో చెప్పారు. "నిన్ను చూడగోరు నీపుణుండు పసిపాప యగునంతండె దైవ మరయగలడు..." (337 పద్యం) అంటూ కల్లా, కపటంలేకుండా అంతరంగ శుద్ధితో అమ్మనారాధిస్తే కరుణిస్తుంది. పవిత్ర మనస్సుతో సేవించాలి. శరన్నవరాత్రులలో ఆభువనైకమాతను సేవించి తరిద్దాం!

భగవత్సేవలో....

సంపాదకులు

## శ్రీ గోవిందమాంబా మహాదేవి నవరాత్రి మహోత్సవములు

**తే॥ 13.10.2015 నుండి తే॥ 22.10.2015 వరకు**

**తే॥ 13.10.2015** పూజ్యపాద శ్రీశ్రీశ్రీ 'యోగి' **అచలానందస్వామివారి జన్మదిన** సందర్భముగా **ప్రత్యేక కార్యక్రమములు** జరుగును

**తే॥ 13.10.2015 మంగళవారం అమ్మవారికి చండీమహాదేవి**

**తే॥ 14.10.2015 బుధవారం అమ్మవారికి గాయత్రీ మహాదేవి**

**సహస్రకుంకుమార్చన** ముత్తైదువులచే జరుపబడును.

**తే॥ 15.10.2015 గురువారం అమ్మవారికి అన్నపూర్ణ మహాదేవి**

**తే॥ 16.10.2015 శుక్రవారం శ్రీ గోవిందమాంబా మహాదేవి కి నోట్లతో ప్రత్యేకంగా లక్ష్మీదేవి అలంకరణ**

**తే॥ 17.10.2015 శనివారం అమ్మవారికి శాకాంబరి (పార్వతి) అలంకరణ**

**తే॥ 18.10.2015 ఆదివారం అమ్మవారికి లలితాదేవి అలంకరణ**

**తే॥ 19.10.2015 సోమవారం అమ్మవారికి సరస్వతీ అలంకరణ** (విద్యార్థులచే ప్రత్యేక పూజ)

**తే॥ 20.10.2015 మంగళవారం కనక దుర్గాపూజ, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ.**

**తే॥ 21.10.2015 బుధవారం మహార్నవమి, ఉజ్జయినీ మహంకాళి అలంకరణ.** (కుమారీ పూజ)

**తే॥ 22.10.2015 గురువారం సర్వాలంకారభూషిణి గా శ్రీ గోవిందమాంబ మహాదేవి దర్శనం.**

ఉదయం గం॥ 5-00 లకు **108 కలశములతో అమ్మవారికి అభిషేకము** జరుగును. (సం॥లో ఈ ఒక్కరోజు మాత్రమే భక్తులచే ప్రత్యక్షముగా అమ్మవారికి అభిషేకము చేయించబడును.) ఈ కార్యక్రమములో భక్తులందరూ పాల్గొనవచ్చును.

**శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు, ఒంగోలు - 523 002**

# దీనజన సేవ

... శింగల్‌రెడ్డి ఈశ్వరరెడ్డి ...

పైఠణపురమను పట్టణమున ఒక బ్రాహ్మణ కుటుంబముండెను. అతనికి సూర్యోపాసనచే పుత్రుడు కలిగెను. అతనికి భానుదాసుడని పేరు పెట్టిరి. అయిదు సం॥ల వయసులో ఉపనయనము చేశారు. విద్య కొరకు పాఠశాలకు పంపిరి. భానుదాసునికి విద్యయందు ఆసక్తిలేదు. ఆటలందు ఇష్టముమెండు. చదువులో వెనుకబడినాడని తల్లిదండ్రులు దండించినా గురువులు ఆగ్రహించినా ఫలితం సున్నా. ఒకరోజు తండ్రి కోపించి దండిస్తే అలిగి ఎవరికీ చెప్పకుండా అడవికి వెళ్లాడు.

అక్కడ ఒక గుహలోవున్న సూర్యనారాయణమూర్తి విగ్రహానికి సాష్టాంగ ప్రణామముచేశాడు. సూర్యవరమున పుట్టిన వాడైనందున వెంటనే సూర్యదేవుడు ప్రత్యక్షమై అతనికి ఒక పాత్రలో పాలు ఇచ్చాడు. కుమారా ఈ పాలు తాగి ప్రతి దినం భగవంతుని ప్రార్థించమని భక్తిబోధ చేశాడు. మానవజన్మ ఉత్కృష్టమైనదని, భగవంతుని సేవిస్తే అనుగ్రహముతో పురుషోత్తముడౌతాడని లేకుంటే జీవితం నిరర్థకమౌతుందని వివరించాడు. పాలు త్రాగినందున విద్యావంతుడవు, జ్ఞానవంతుడౌతావని చెప్పి అదృశ్యమయ్యాడు.

తల్లిదండ్రులు తమకుమారుని జాడతెలియక ఏడు రోజులుగా ఎన్నోచోట్ల వెతికారు. తమ కుమారుని గురించి ఎందరినో విచారించారు. అంతలో ఒక సాధువు ఎదురయ్యాడు. మీ కుమారుడు అరణ్యంలోని కొండ గుహలో వున్నాడని చెప్పాడు. వారు అడవికి వెళ్లి కొండగుహను చేరుకున్నారు. అక్కడ సూర్యదేవుని పాదాలవద్ద అచేతనంగా ధ్యానంలోవున్న కుమారుని చూశారు. తల్లిదండ్రులు ఆనందించి తమ కుమారుని పరామర్శించగా బాలుడు కళ్లు తెరిచాడు. ఏడురోజులుగా ఏ భయమూలేకుండా ఈ అడవిలో ఎలా ఉన్నావు. ఆహారం ఏమి తిన్నావు అని వివరాలడిగారు. అందులకాబాలుడు తల్లిదండ్రులకు నమస్కరించి జరిగిన విషయం చెప్పాడు. మహా తేజస్వియగు ఆ మహనీయుడిచ్చిన పాలు త్రాగినందున ఆకలిదప్పులు లేవని సమస్త ప్రపంచమంతా ఆ భగవంతుడే వ్యాపించి యున్నాడని తెలిసి భయందూరమైనదని నా మనస్సు ఆనంద పరిపూర్ణమైనదని తెలిపాడు. మీరుకూడా ఆ శ్రీమన్నారాయణుని భజించమని తెలిపాడు. మీరు నాకు విద్య నేర్పించినా అది నాకు లభించలేదు. కాని ఆ పరమేశ్వరుని అనుగ్రహంతో సకల విద్యలు తెలిసినట్లు, సృష్టి రహస్యమంతా అవగతమైందన్నాడు. అందరము ఆదివ్య పురుషుని కీర్తించుదామని చెప్పి తల్లిదండ్రులు తమ కుమారుని ఆ సూర్యనారాయణుడే రక్షించాడని ఆయన అనుగ్రహంచే ప్రహ్లాదునికి భగవద్భక్తి అమరినట్లు తమ కుమారునికీ భక్తి పరిపక్వమైనదని భావించారు.

తల్లిదండ్రులు కుమారుని ఇంటికి తీసికొని వెళ్లి యవ్వనకాలమున మంచి కన్యను చూసి వివాహము చేశారు. ఆ యువతి ద్వారా భానుదానుడు సంతానవంతుడయ్యాడు. సంసారములో వున్నా తామరాకుపై నీటిబొట్టువలె దేనినీ అంటక

భగవన్నామ స్మరణతో పాండురంగని సేవించుచుండెను. తల్లిదండ్రులు గతించారు. ఏ పనీచేయని భానుదాసునికి కుటుంబ పోషణ భారమయింది. సంపాదనలేనందున అన్నవస్త్రాలకే కొరత ఏర్పడింది. అతని భగవద్భక్తికి మెచ్చిన కొందరు వర్తకులు కొంత ద్రవ్యము సమకూర్చి పోషణ చేయమని సలహానిచ్చిరి. ఆ ధనంతో వస్త్ర వ్యాపారం ప్రారంభించాడు. నిత్యము విఠలుని భజిస్తూ న్యాయబద్ధంగా వ్యాపారం చేయసాగారు. వ్యాపారం అందరికంటే లాభదాయకంగా అభివృద్ధి అయింది. కొందరు వర్తకులకు ఈర్ష్యపొడసూపింది.

తాను సంపాదించిన మొత్తమును కుటుంబ పోషణకు మితముగాను, దీనజనపోషణకు, సహాయమునకు, అధికముగా ఖర్చు చేయుచుండెను. నశ్వరమైన శరీరముపై అభిమానము విడిచి శ్రీహరిని సేవిస్తూ జీవనం చేయడం ఉత్తమమని తనవద్దకు వచ్చినవారికి బోధించేవాడు. ఆడంబరములేని జీవనం చేయమని హితోపదేశం చేస్తూ నిరంతరం దీన జన పోషణలో గడిపేవాడు.

ఒక రోజు భానుదాసుడు మరికొందరు వర్తకులు కలసి నూతన వస్త్రములు కొనుగోలుచేసిరి. దారిలో ఒక దేవాలయములో విడిది చేసిరి. ఆ ఊరిలో హరి కీర్తన వినుటకు భానుదానుడు వెళ్లాడు. ఆ సమయంలో ఈర్ష్యపడిన వర్తకులు తమ బట్టలమూటలను భద్రపరిచి భానుదానుని వస్త్రాలమూటలను పాడుబావిలో పడవేశారు. కొంత సేపటికి దోపిడీ దొంగలు వచ్చి వర్తకులను హింసించి వారి వద్దనున్న ధనమును, నూతన వస్త్రముల మూటలను దోచుకొని వెళ్లారు.

అందులకా వర్తకులు భానుదాసునికి మోసం తలపెట్టినందున తమకు తగిన శాస్తి జరిగిందని పాండురంగడే మనచేత భానుదాసుని మూటలు బావిలో పడవేయించెనని మనపాపమే దొంగల రూపములో వచ్చిందని భావించారు. భానుదాసుడు తిరిగివచ్చి జరిగిన విషయం తెలుసుకున్నాడు. జరిగిన దానికి చింతించవద్దని తన బట్టల మూటలను బయటకు తీయించి అందరికి పంచియిచ్చాడు. ఆపుండరీకుడే తన బట్టలమూటలను రక్షించాడని కామక్రోధ, మోహములను విడిస్తే ఆ దేవదేవుడే అందరినీ కాపాడుతాడని బోధించాడు.

తమ నగరానికి తిరిగివచ్చి తన బిడ్డలకు వర్తకాన్ని అప్పజెప్పి సంపాదించిన దానిలో కొంత ధనాన్ని కూడా ఇచ్చి మిగిలిన ధనమునంతా పేదసాదులకు దానంచేస్తూ, దీనజనోద్ధారణకై శ్రమిస్తూ పండరినాదుని సేవలో గడపసాగాడు. అన్నదానం, వస్త్రదానం, చేస్తూ శేషజీవితం గడిపి విఠలనాధునిలో ఐక్యమయ్యాడు.

దీనజనోద్ధరణ చేస్తే అది మాధవునకు చేసిన సేవగానే భావిస్తే ఎలాంటి లోటు లేకుండా ఆ దేవదేవుడే కాచి రక్షిస్తాడని భానుదాసుని జీవితం తెలుపుతుంది. నిస్వార్థంగా తమ వద్దనున్న ధనాన్ని పదిమంది కొరకు ఉపయోగిస్తే ఆ పరంధాముడే ఏ కొరతలేకుండా చూస్తాడని మనం కూడా సేవామార్గంలో పయనించాలి. □

- గడచిన క్షణం మళ్లారాదు. రాబోయే క్షణం మీదికాదు. ఈ క్షణం మాత్రం మీదే. దీనిని మీ నుండి ఎవరూ దూరం చేయలేరు.
- భగవంతుని నీవు చూడలేకపోయినా ఆయన నిన్ను చూస్తూనే వున్నాడు. కనుక నీ నడవడి సక్రమంగా వుంచుకో.

# మహాభారతంలోని నీతి కథలు

.. డాక్టర్ కె. సత్యనారాయణ
సెల్: 9440732210

అసూయ అనేది మానవుని ఎంతటి పతనావస్థకు దిగజారుస్తుందో అదీ ముఖ్యంగా ఆడవాళ్ళలో అందులోనూ సవతుల మధ్య అసూయ పదితలల నాగుపాములాగా ఎలా బుసలు కొడుతుందో మహాభారతంలోని కద్రూవినతుల కథ తరచి చూస్తే తెలుస్తుంది.

సత్యయుగంలో దక్ష ప్రజాపతికి కద్రువ, వినతలు అనే ఇద్దరు కుమార్తెలు ఉండేవారు ఆయన వారిని కశ్యపునకిచ్చి వివాహం చేశాడు. కొంతకాలం జరిగిన పిదప కశ్యపుడు వారిద్దరి పరిచర్యలకు సంతోషించినవాడై "ఏదైనా వరం కోరుకోమ"ని తన భార్యలతో అంటాడు. కద్రు సమాన తేజస్వులైన వేయిమంది నాగులు కుమారులుగా కావాలని అడుగుతుంది. వినత అంతకంటే బలవంతులైన ఇద్దరు కుమారులు కావాలంటుంది. వారి కోరికలను విన్న కశ్యపుడు "తథాస్తు" అని అంటాడు. జాగ్రత్తగా గర్భాన్ని రక్షించుకోమని చెప్పి కశ్యపుడు తపస్సు చేసుకోవడానికి అరణ్యానికి వెళ్ళిపోతాడు. కొంతకాలమయ్యాక కద్రువ వేయి అండాలను, వినత రెండు అండాలను కంటారు. దాసీలు వాటిని జాగ్రత్తగా నులివెచ్చని పాత్రలలో భద్రపరచగా ఐదువందల సంవత్సరాలకు కద్రువ అండాల నుండి వేయి మంది పుత్రులు పుడతారు. వినత మాత్సర్యంతో తన రెండు అండాలలో ఒకదానిని పగలకొడ్తుంది. అందులో నుండి వెలువడిన తల, మొండెంమాత్రమే కలిగిన శిశువు బైటకువచ్చి క్రోధంతో, "అమ్మా! ఏ సవతిని చూసి అసూయతో, తొందరపాటుతో నన్నిలా అసంపూర్ణ శరీరునిగా చేశావో, ఆ సవతికే 500 యేళ్ళు దాసీగా జీవించు" అని శాపమిస్తాడు. తర్వాత తల్లి దుఃఖిస్తూ ఉంటే జాలిపడి "ఈ రెండో అండాన్ని పగలకొట్టకుండా ఉంటే బలవంతుడైన కొడుకు పుట్టి నీ దాస్యాన్ని పోగొడతాడని" శాపవిమోచనను చెప్పి సూర్యునికి రథసారథిగా వెళ్లిపోతాడు.

కొంతకాలానికి కద్రూ వినతలు విహరిస్తుండగా వారికొక దివ్యాశ్వం కనబడింది. అది పాలసముద్రాన్ని చిలికినప్పుడు పుట్టిన ఉచ్ఛైశ్రవమనే గుఱ్ఱం. ఆ గుఱ్ఱాన్ని చూసిన కద్రువ, వినతను చూసి ఆ గుఱ్ఱం ఏ రంగులో ఉంది ?" అని అడుగుతుంది. అందుకు వినత అది తెల్లగా ఉందంటుంది. వెంటనే కద్రువ "గుఱ్ఱం తెల్లనిదే కానీ దానితోక మాత్రం నల్లగా ఉంది పందెం కాద్దామా ? " అంటూ "నేను ఓడిపోతే నీకు దాసిని అవుతాను. నీవు ఓడిపోతే నాకు దాసివి కావాలి. అని సవాల్ విసురుతుంది. వినత సరేనంటుంది చీకటి పడబోతున్నందున రేపటిరోజు వచ్చి ఆ గుర్రం రంగు చూడవచ్చని ఇంటికి వెళ్లిపోతారు. కద్రువ వినతను ఎలాగైనా తన దాసీగా చేసుకోవాలనుకుని తన వేయిమంది కుమారులను పిలిచి "మీరంతా వెళ్లి ఆ గుఱ్ఱం తోక నల్లగా అయ్యేలా ఆ తోకను పట్టుకొని వేలాడండి" అని ఆజ్ఞాపిస్తుంది. ఆ మాట విన్న కొంత మంది ఇది అధర్మం ఆ పని చేయలేమని అంటారు. అలా అన్నవారిని "జనమే జయ మహారాజు చేసే సర్పయాగంలోపడి చావండి" అని కద్రువ తన బిడ్డలను శపిస్తుంది. ఆమె క్రోధానికి భయపడిన సర్పాలు ఆమె చెప్పినట్లే గుర్రం తోకను అంటిపెట్టుకుని నల్లగా కన్పించేటట్లు చేస్తాయి. మరుసటిరోజు కద్రూవినతలు గుర్రం దగ్గరకు చేరుకోగా గుర్రం శరీరమంతా తెల్లని కాంతితో మెరిసిపోతుండగా, తోకమాత్రం నల్లగా కన్పిస్తుంది. వినత ఎంతో బాధపడి కద్రువకు దాసిగా పరిచర్యలు చేయసాగింది. కనుక స్వయంగా దక్షుని కుమార్తెలైనా అక్క చెల్లెళ్ళైనా వాల్లలో వున్న అసూయలు వాళ్లచేత ఎంతటి పనులు చేయించాయో అర్థమౌతోంది.□

# సర్వం శక్తిమయం జగత్

... ములుకుట్ల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, ఒంగోలు.

**యాదేవీ సర్వభూతేషు శక్తిరూపేణ సంస్థితా।**

**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః॥ - చండీసప్తశతి**

(అన్ని భూతముల యందు శక్తి రూపముతో ఉండు దేవికి మాటిమాటికి నమస్కారములు)

శరదృతువు అంటే ఆశ్వయుజ కార్తీక మాసములు ఆశ్వయుజ మాసం అమ్మవారిదైతే, కార్తీక మాసం అయ్యవారిది.

శుద్ధపాడ్యమి నుండి దశమి వరకు జరిగే పది రోజులు శక్త్యారాధనకి అనుకూలమైన కాలం.

'దశహరా - దసరా' పదిరకాల పాపాలను హరించునది

అని ప్రశస్తి. మనిషిలో దాగిన జడత్వం, లోభం, దురాశ, పాపచింతన, క్రోధం వంటి వికారాలను నశింపచేసుకొని, ఉపాసనతో శక్తిమంతులుగా మారే పుణ్యదినాలు.

జగన్మాత మహిషాసురునితో 9 రోజులు యుద్ధం చేసి అతడిని చివరి రోజు సంహరించిన రోజు విజయదశమి అని, రావణవధచేసి రాముడు విజయం సాధించిన రోజని, అర్జునుడు జమ్మిచెట్టుమీద ఉన్న ఆయుధాలు తీసుకొని శత్రువుల మీదకు యుద్ధానికి వెళ్ళినరోజు విజయదశమి అని ప్రమాణము. విజయదశమి రోజున పారువేటకు (సీమోల్లంఘనం) వెళ్లటం జమ్మిచెట్టు ఆకులను పెద్దలకు ఇచ్చి

**శమీ శమయతే పాపం శమీశత్రువినాశనీ।**

**అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియదర్శినీ॥**

ఈ శ్లోకం చెప్పి ఆశీస్సులు తీసుకుంటారు.

'నమాతుః పరదైవతం' సృష్టిలో తల్లిని మించిన దైవం లేదు. సృష్టి స్థితిలయకారిణి అయిన ఆ పరమేశ్వరిని అమ్మగా ఆరాధించడంలో సౌలభ్యం ఉంది.

శరన్నవరాత్రులలో బ్రహ్మవిష్ణుశివాత్మిక, సర్వశక్తిస్వరూపిణి అయిన దుర్గామాతను విశేషమైన పూజలతో, ఉపవాసాలతో, లలితా సహస్రనామ పారాయణలు, చండీసప్తశతీ పారాయణలతో దుర్గాహోమాలతో, సువాసినీపూజ, కుమారీ పూజతో అమ్మను సేవించాలి.

కుమారీ పూజలు అమ్మవారికి ప్రతీకలుగా 2 సం॥ బాలికలు మొదలుకొని 10 సం॥ లోపుకల బాలికలను పూజించాలని దేవీభాగవతము చెబుతుంది.

**1) కౌమారీ** : మొదటిరోజు పూజించే 2 సం॥ బాలిక

**పూజా ఫలం** : శత్రునాశనం, ఆయురారోగ్య ధనవృద్ధి, దుఃఖదారిద్ర్యనాశనము.

**2) త్రిపుర** : **2**వ రోజు పూజించే 3 సం॥ బాలిక

**పూజా ఫలం** : పుత్రపౌత్రాభివృద్ధి, దనధాన్యవృద్ధి.

**3) కళ్యాణీ** : **3**వ రోజు పూజించే 4 సం॥ బాలిక

**పూజా ఫలం** : విద్య, విజయప్రాప్తి

**4) రోహిణీ** : **4**వ రోజు పూజించే 5 సం॥ బాలిక

**పూజా ఫలం** : సర్వరోగనాశనం, ఆరోగ్యసిద్ధి

**5) కాళికా** : **5**వ రోజు పూజించే 6 సం॥ బాలిక

**పూజా ఫలం** : శత్రునాశనము

➢ తరువాయి 16 వ పేజిలో.......

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్; 09410990829

(19. పాలక (రాజ) ధర్మములు)

(గత సంచిక తరువాయి)

శ్లో॥ యత్ర వర్జయతే రాజా పాపకృద్భ్యో ధనాగమమ్।
తత్ర కాలేన జాయంతే మానవా దీర్ఘజీవినః ॥ (మను. IX-246)

ఏ దేశములో పాలకుడు పాపభూయిష్టమైన ధనమును పరిగ్రహించడో, అట్టి దేశములో మానవుల జననము సకాలములో జరుగును మరియు వారు దీర్ఘాయుష్యమును కలిగియుందురు.

శ్లో॥ నిష్పద్యంతే చ సస్యాని యథోప్తాని విశాం పృథక్।
బాలాశ్చ న ప్రమీయంతే వికృతం న చ జాయతే ॥ (మనుIX-247)

వైశ్యుడు విత్తిన విత్తనములు చక్కగ మొలకలెత్తి, సస్యశ్యామలముగా పెరుగును. అకాల మరణములు గాని, బిడ్డలు వికలాంగులై జన్మించుటగాని సంభవింపవు.

ఇచట న్యాయార్జిత ధనముతో పరిపాలించుటలో గల శుభములను మను మహర్షి చక్కగా వివరించినాడు.

ఇపుడు, మనుమహర్షి నేరస్థులను తగు విధముగ శిక్షించక వదలిన యెడల పాలకునకు సంభవించు ప్రమాదములను వివరించుచున్నాడు :

శ్లో॥ యావాన వధ్యస్య వధే తావాన్వధ్యస్య మోక్షణే।
అధర్మో నృపతేర్దృష్టో ధర్మస్తు వినియచ్ఛతః ॥ (మనుIX-249)

ఒక అమాయకుడైన వ్యక్తిని చంపినందువలన ఎట్టి పాపము లభించునో, అట్టి పాపము ఒక నేరస్థుని శిక్షించక వదలిన యెడల కలుగును. కావున, శాస్త్రాను సారముగా తగు శిక్షను విధించుట పాలకుని యొక్క ధర్మమైయున్నది.

శ్లో॥ అశాసంస్తస్కరాన్యస్తు బలిం గృహ్ణాతి పార్థివః।
తస్యప్రక్షుభ్యతే రాష్ట్రం స్వర్గాచ్చ పరిహీయతే ॥ (మనుIX-254)

ఏ పాలకుడు చోరులను దోపిడివాళ్ళను శిక్షించుటకు అసమర్థుడై యుండియు, ప్రజల నుండి పన్నులను మాత్రము వసూలు చేయునో, అట్టి పాలకుడు స్వర్గచ్యుతుడగును. మరియు అతని దేశములో అధ్వాన్నస్థితి చెలరేగును.

శ్లో॥ నిర్భయం తు భవేద్యస్య రాష్ట్రం బాహుబలాశ్రితమ్।
తస్య తద్వర్ధతే నిత్యం సిచ్యమాన ఇవ ద్రుమః ॥ (మనుIX-255)

ఏ దేశము పూర్తిగా పాలకునిపై ఆధారపడి నిర్భయముగాను, నిశ్చింతగాను ఉండునో; అట్టి దేశము, చక్కగా నీరుపోసి పెంచిన మొక్కలాగా, పురోభివృద్ధి మార్గమున పయనించుచుండును.

తరువాత, చోరులు దోపిడిగాండ్రు మొదలగు సంఘవిద్రోహులను గుర్తించి, శిక్షించు విధానము క్రింది శ్లోకములలో చెప్పబడినది.

శ్లో॥ తాన్విదిత్వా సుచరితైర్గూఢై స్తత్కర్మకారిభిః।
చారైశ్చ అనేక సంస్థానైః ప్రోత్సాద్య వశమానయేత్ ॥ (మనుIX-261)

పాలకుడు అనేక మంది గూఢచారులను వేరు వేరు స్థలములలో నియుక్తులను జేయవలయును. వారు వారి యొక్క పనిలో నిపుణులుగాను, నిజాయితీపరులుగాను, మరియు మారువేషములు వేయుటలో నేర్పుగలవారుగాను ఉండవలయును. వారి ద్వారా పాలకుడు సంఘద్రోహులను గుర్తించి, వారిపై బలమైన హస్తము నుంచి, వారిని అదుపులో నుంచవలయును.

శో॥ తేషాం దోషానభిఖ్యాప్య స్వే స్వే కర్మణి తత్త్వతః।
కుర్వీత శాసనం రాజా సమ్యక్సారాపరాధతః॥ (మనుIX-262)

వారిలో ప్రతి వ్యక్తి యొక్క నేరములను వేరువేరుగా ప్రజల సమక్షములో బహిర్గతమొనర్చి, వారి నేరముల కుపయుక్తమగు శిక్షలను విధించి, వారి నడుపులోనికి తీసికొని రావలయును.

శో॥ నహి దండాదృతే శక్యః కర్తుం పాపవినిగ్రహః ।
స్తేనానాం పాపబుద్ధీనాం నిభృతం చరతాం క్షితౌ॥ (మనుIX-263)

సమాజములో అజ్ఞాతముగా మెలుగుచూ నేరములను జేయు నేరస్థులను లేక సంఘద్రోహులను, వారి పాపభూయిష్టమైన ప్రక్రియలను అరికట్టుటకు శిక్ష తప్ప వేరే మార్గములేదు.

శో॥ తత్సహాయైరనుగతైర్నానా కర్మ ప్రవేదిభిః ।
విద్యాదుత్సాదయేచ్చైవ నిపుణైః పూర్వతస్కరైః ॥ (మనుIX-267)

గత జీవితములో చోరులుగాను, దోపిడిదొంగలుగాను అయియుండి, ప్రస్తుతం సంఘద్రోహులుండు సందు, గొందులను, మూలమూలలను తెలిసియుండి నటువంటి మరియు సంఘద్రోహులకు సమయ సమయమున సహాయ మందించుచున్న వారి యొక్క జాడ తెలిసియుండినటువంటి వ్యక్తుల యొక్క సహాయమును పాలకుడు తీసికొని, సంఘద్రోహులను పట్టి, వారిని తగు విధముగ శిక్షించవలయును.

'దొంగను దొంగే పట్టగలడు' అనెడి సామెత నాధారముగా జేసికొని పాలకుడు దొంగలను పట్టుటకు దొంగలనే గూఢచారులుగా ఉపయోగించుకొనవలయునని మనుస్మృతి బోధించుచున్నది.

శో॥ న హోఢేన వినా చౌరం ఘాతయేద్ధార్మికో నృపః ।
సహోఢం సోపకరణం ఘాతయేదవిచారయన్॥ (మనుIX-270)

సరియైన సాక్ష్యములేకుండా పాలకుడు ఏ ఒక్క దొంగను శిక్షించరాదు. ఒక్కసారి నిర్వివాదాంశమైన సాక్ష్యము దొరికినపుడు రెండవ ఆలోచన లేకుండా వెంటనే అతనిని శిక్షించవలయును.

శో॥ రాష్ట్రేషు రక్షాధికృతాం సామంతాంశ్చైవచోదితాన్ ।
అభ్యాఘాతేషు మధ్యస్థాంఛిష్యా చ్చౌరానివ ద్రుతమ్ ॥ (మనుIX-272)

రాష్ట్ర అధికారులు దొంగలతో రహస్యముగా చేయి కలిపినను లేక ఉపేక్ష చేసినను, వారిని గూడ దొంగలుగా లెక్కించి, శిక్షించవలయును.

శో॥ బంధనాని చ సర్వాణి రాజమార్గే నివేశయేత్ ।
దుఃఖితా యత్ర దృశ్యేరన్వికృతాః పాపకారిణః ॥ (మనుIX-288)

రాష్ట్ర పాలకుడు ఖైదీగృహములను, ఖైదీల యొక్క దౌర్భాగ్యస్థితిని-వారనుభవించు కడగండ్లను ప్రజలందరు చూచునట్లుగా, రహదారుల ప్రక్కన నిర్మించవలయును.

అట్లు రహదారుల ప్రక్కన జైలు గృహములను నిర్మించుటలో ఉద్దేశ్యమేమనగా - ఖైదీలు అనుభవించు నికృష్ట బాధలను చూచుచున్న ఇతర ప్రజలు నేరములను చేయుటకు జంకుదురు. అందువలన నేరస్థుల సంఖ్య తగ్గుట కవకాశమున్నది.

దేశ పాలకుడు తన దేశ ప్రజల కోరికల నెట్లు తీర్చవలయునను విషయమును మనుస్మృతి సోదాహరణముగా వర్ణించుచున్నది.

శో॥ వార్షికాంశ్చతురో మాసాన్ యథేంద్రోఽభిప్రవర్షతి ।
తథాభివర్షే త్స్వం రాష్ట్రం కామైరింద్ర వ్రతం చరన్॥ (మనుIX-304)

ఎట్లు ఇంద్రుడు సంవత్సరములో నాల్గు మాసములు వర్షములను పోసి పాడిపంటలతో ప్రజలను తృప్తిపరచుచున్నాడో, అట్లే రాష్ట్రపాలకుడు ప్రజల కోర్కెలను తీర్చవలయును.

శో॥ యథా సర్వాణి భూతాని ధరా ధారయతే సమమ్।
తథా సర్వాణి భూతాని బిభ్రతః పార్థివం వ్రతమ్ (మనుIX-311)

ఎట్లు భూదేవి చరాచర సమస్త ప్రాణులను భరించుచున్నదో, అట్లే రాష్ట్రపాలకుడు అతని దేశపు ప్రజలను భరించి, పృధ్వివలె ప్రవర్తించవలయును.

(సశేషం)

# పార్వతి తపస్సు

శ్రీ రావూరి భరత్ నరసరావుపేట, సెల్ : 9533721776

తారకాసురుడు బ్రహ్మవలన పొందిన వరముచే దుర్జనుడై స్వర్గము మీదికి దాడివెడలి, స్వరమునకు ఉపద్రవము చేసెను. దేవతలందరూ బ్రహ్మదేవుని యొద్దకుపోయి "స్వామీ! తారకాసురుని వలన మేము పడరాని పాట్లు పడుతున్నాము మమ్ము రక్షింపవే" అంటూ వేడుకున్నారు. అంత బ్రహ్మదేవుడు వాడి భక్తికి మెచ్చి వరమిచ్చాను. నేను మిమ్ములను కాపాడతాను. తారకుని చంపెడివాడు కుమారస్వామి ఆయన పుట్టవలయును. దక్షప్రజాపతి కూతురైన దాక్షయణి శివుని భార్య. తండ్రి మీద కోపంతో తానే తగులబడిపోయినది. ఆమె హిమవత్పర్వతమునకు కుమార్తై పుట్టినది. శివుని పెండ్లియాడవలసియున్నది. వారికి కుమారస్వామి జన్మించును. తారకుని సంహరించును. ఇది పార్వతి పూర్వవృత్తాంతము అని చెప్పెను.

పార్వతీ హిమవంతుని కూతురుగా జన్మించి పెరుగుచుండెను. ఒకనాడు నారదమునీంద్రుడు హిమవంతుని కడకు వచ్చి శివుడు పార్వతిని పెండ్లి యాడవలెనని తపస్సు చేయుచుండెను. ప్రమథులందరూ శివుని వద్దనే ఉన్నారు. నందీశ్వరుడు శివునకు కాపుగానున్నాడు. ఆయన తపస్సు సేయునది కొండలో ఒక చోట. అనగా శివుడు తన అతిథి. హిమవంతుడు శివుని వద్దకుపోయి అర్చనచేసి తన కుమార్తె అయిన పార్వతిని శివునకు పరిచర్యలు చేయ నియమిస్తానని పల్కెను. అంత శివుడు వల్లెయనెను.

పార్వతి పుట్టినింట శుక్లపక్ష చంద్రునివలె దిన దిన ప్రవర్తమానయై పెరుగుచున్నది. కొన్నాళ్ళకు యుక్త వయస్కురాలయైనది. హిమవంతుడు పార్వతిని శివునికి పరిచర్యలు చేయ నియమించివచ్చెను. అతిథులకు పరిచర్యలు సేయుట సంస్కారవంతుల లక్షణము. పార్వతి కొంతకాలం శివునకు పరిచర్యలు చేసి ఇంటికి వచ్చెను ఆమె తన్ను తాను నిందించు కున్నది. తన సౌందర్యము వృథయనుకున్నది. దిగులుపడ్డది. శివుడు దేనికి లొంగునా యనుకున్నది. ఒక్క తపస్సుకే లొంగునని ఆశించినది. తల్లిదండ్రుల ఆనతిని అడిగినది. తల్లి వారించినది. అయినను వినలేదు. చివరకు తండ్రి అనుమతితో పార్వతి దీక్షగైకొన్నది.

భూధర రాజకన్య మణి భూషణముల్ దిగఁద్రావి యూశ్వరా

రాధన కేళి కౌతుక పరాయణయై భరియించెఁ బాండుర

క్షాధృతి పూర్వకంబుగఁ బ్రగాఢ పయోధరమండలీసము

త్సేధ విశీర్ణ సంహతుల జిల్లు మమీరుహ వల్కలంబులన్

హిమవంత మహారాజంతటి రాజు తనయ మణిమాణిక్యాలు పొదిగినటువంటి జిల్గు వస్త్రములను విడిచి వనదేవతలు ధరించే వస్త్రములను ధరించినది.

**చంచరీ కాంగనాగరుచ్ఛాయనేలు**
**కుటిల కోమలతర దీర్ఘ కుంతలములు**
**మడమలంటంగ నిడుపాటి జడలు గట్టఁ**
**బాశుపత దివ్యదీక్షఁ జేపట్టె గౌరి.**

**భావం :** ఆడతుమ్మెద వంటి అందమైన మేని చాయకృపావైనకుంతలములను (జుట్టు) మడచి నెత్తిపై శిగగచుట్టి. శివుని గూర్చి ఘోరమైన దీక్షగైకొన్నది గౌరి.

**ముత్యాల మొలనూలి మురువు సూపెడునట్టి**
**జఘనంబుపై మౌంజినవదరించె**
**గందుక క్రీడపై గారాబువచరించు**
**హస్తాబ్జములఁబూనె నక్షమాల**
**కస్తూరి కొంగ రాగములతో విలసిల్లు**
**తనువల్లి హత్తించె ధవళభూతి**
**బొమ్మలపెండిలిపాటఁబ్రొద్దుపుచ్చునెలుంగు**
**నీలకంఠస్తోత్ర నియతిఁ గూర్చెఁ**

ముత్యాలు మొదలైన హారాలు ధరించే ఆమె జఘనంబుపై మౌంజి (ముంజగడ్డితో నేసిన వటువునకు, మొలకు కట్టుతాడు) దరించింది. తల్లి గారాబంతో ఆడించే ఆమె చేతులందు రుద్రాక్షలు ధరించింది. చందనము, కస్తూరి మొదలైన సుగంధాల విరితోనున్న ఆమె తెల్లని విభూతిని పెట్టుకున్నది. (తన తనువంతా విభూతిని రాసుకున్నది) ఎప్పుడు బొమ్మల పెళ్ళిళ్ళు చేయుచు నుండెడి గౌరి నీలకంఠ స్తోత్రములను పఠిస్తుంది. శివునిపై ధ్యానముతో ప్రొద్దుపుచ్చుతుంది.

**బసిడి కమ్ముల యందంపుఁబట్టుచేల**
**కొంగు చాటున వర్ధిల్లు కుచ భారమున**
**గంతగా వైచెఁబులితోలు కళవసంబుఁ**
**బరమ కళ్యాణి గిరిసార్వభౌమతనయ**

బంగారు వన్నెతో అందమైన వస్త్రముల మాటున నుండెడి కుచద్వయముపై గంతగా పులితోలు కప్పుకున్నది గిరిసార్వభౌముని కుమార్తె.

**హంసతూలికా తల్పముపై నలరు మొగ్గ**
**యొత్తునునుమేనుగల్లు నీలోత్పలాక్షి**
**బాహువల్లి తలాఁడఁగాఁబవ్వళించె**
**శైలపాషాణ పట్టికా స్థండిలమున!**

హంసతూలికా తల్పముపై నాజూకైన జాజి మొగ్గలాంటిది. పద్మములవంటి కనులు కల్గిన పార్వతి తనరెండు చేతులను తలగడగా పెట్టుకుని కఠినమైన శిలలపై (రాళ్ళు) పరుండినది. భవిష్యత్తులో ఆమె జగములకు తల్లిగాబోతున్నది కదా! ఘోరమైన తపస్సు చేయుచున్నది. ఆకులు తినుటకూడా మానివేసినది. అందుచేత ఆమెకు 'అపర్ణ' అనే పేరు వచ్చింది. ఆమె తపస్సు సేయుచుండగా శతవృద్ధులైన ఋషులు వచ్చి ఆమెకు నమస్కరింతురు. ఎందుకంటే ఆమె 'అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ' కాబట్టి. పాశుపత దివ్యదీక్షా విభాసమాన దివ్యతేజో విశేష సందీప్తమూర్తియైన సుకుమారమైన ఆమె అనేక విధముల శివుని గూర్చి నిశ్చల భక్తి, ప్రేమతో కూడిన తపస్సు చేస్తుంది.

**జయ సర్వేశ్వర! సర్వలోక జనకా! చంద్రార్థ చూడామణీ**
**జయ కామాంతకా! కామితార్థ ఫలదా! చక్షుశ్శ్రవఃకుండలా**
**జయసంపూర్ణకృపాగుణైక వసతీ! శైలేంద్రజావల్లభా!**
**జయదక్షాధ్వర మర్దనా! జయగిరీశా! యీశా! రక్షింపవే!**

యీరీతి పార్వతి శివుని పరిపరి విధాలా ప్రార్థిస్తూంది. 'శైలేంద్ర జావల్లభా' అనటంలో క్రొత్త అర్థం స్ఫురిస్తుంది. పార్వతి శివుని యింకా పెండ్లి ఆడలేదుకదా! వల్లభుడెట్లైనాడు ? అని సందేహం కల్గకమానదు.

ఆమె జగన్మాత కాబట్టి తప్పక తన భర్తకాగలడని ఆమెకు యెఱుకయే! ఆ తల్లి శివుడు తనకు ప్రత్యక్షమయ్యే వరకు తన తపమాపదు. పరిపరి విధాల స్తోత్రం చేయుచున్నది.

**జయవిరూపాక్షా! యీశ్వరా! దివ్యలోచనా!**
**జయవజ్రహస్తా! దిశానివాసా!**
**జయ పినాకేష్వాస! శాశ్వత! నిత్య! య**
**నిత్య! నిత్యానిత్య! నిరుపమాన!**
**జయ చింత్య! జయరుద్ర! జయమమాదేవ! య**

➢ తరువాయి 23 వ పేజిలో.......

# వేద పరిచయము

## సామవేద పరిచయము

.......... ఆచార్య డా॥ మట్టి కృష్ణారెడ్డి ............

(గత సంచిక తరువాయి)

సామవేదసంహిత ప్రధానముగా 2 భాగములు. 1. పూర్వార్చిక, 2. ఉత్తరార్చిక. ఈ రెండింటి మధ్య 10 మంత్రములుగల మహానామ్నార్చిక కలదు.

**1. పూర్వార్చిక :** ఇందులో 640 మంత్రములు, 6 ప్రకాఠకములు, 12 అధ్యాయములు, 59 దశతులు కలవు. మొదటి 12 దశతులు అగ్నిస్తుతి; తరువాతి 36 దశతులు ఇంద్రస్తుతి, చివరి 11 దశతులు సోమస్తుతి.

**2. ఉత్తరార్చిక :** ఇందులో మొత్తం 1225 మంత్రములున్నవి. 9 ప్రపాఠకములు, 22 అధ్యాయములు, 120 దశతులు కలవు.

**పూర్వార్చిక :**

**మొదటి ప్రపాఠకము :**

ఇందులో 10 దశతులు ఉన్నాయి. ప్రధానంగా అగ్నిదేవత, బృహస్పతి, ఇంద్రుడు, పూష, అంగీరసులకు చెందిన స్తుతులున్నాయి.

**రెండవ ప్రపాఠకము :**

ఇందులో 10 దశతులు ఉన్నాయి. ప్రధానంగా అగ్నిదేవత, ఇంద్ర సహిత మొదలైన దేవతల స్తుతులు ప్రధానమైనవి.

**మూడవ ప్రపాఠకము :**

ఇందులో 10 దశతులు ఉన్నాయి. ప్రధానంగా ఇంద్రుడు, వరుణుడు, అశ్వినులు, మరుత్తులు, ఆదిత్యుడు, సూర్యుడు మున్నగు దేవతల స్తుతులు ఉన్నాయి.

**నాల్గవ ప్రపాఠకము :**

ఇందులో 10 దశతులు ఉన్నాయి. ప్రధానంగా ఇంద్రుడు, ఉషస్సు, అగ్ని, విశ్వేదేవులు, ద్యావాపృథువులు మొదలగు దేవతల స్తుతులు ఉన్నాయి.

**ఐదవ ప్రపాఠకము :**

ఇందులో 10 దశతులు ఉన్నాయి. ఇంద్రుడు, ఆదిత్యుడు, మరుత్తులు, విశ్వేదేవులు, అశ్వినులు, సోముడు, పవమానుడు, అగ్ని, సూర్యుడు, సవిత ఇత్యాది దేవతల స్తుతులు ఉన్నాయి.

**ఆరవ ప్రపాఠకము :**

ఇందులో 9 దశతులు ఉన్నాయి. ఇంద్రుడు, పవమానుడు, సోముడు దేవతల స్తుతులు ఉన్నాయి.

**ఆరణ్యక కాండ :**

ఇది ఆరవ ప్రపాఠకములో 3వ భాగంగా ఉన్నది. ఇందులో ఐదు దశతులు ఉన్నవి. పూర్వార్చికలో స్తుతించబడ్డ దేవతలందరి స్తవములు ఇందులో ఉన్నవి. అన్నదేవతా స్తుతి ఈ కాండలోనే ఉన్న విశేషమైన స్తోత్రము.

**మహానామ్న్యార్చిక :**

ఇందులో ఇంద్రాది దేవతల స్తుతులు ప్రధానంగా గల 10 సామలు ఉన్నవి.

**ఉత్తరార్చిక :**

**మొదటి ప్రపాఠకము :**

ఇందులో 12 దశతులు ఉన్నాయి. ప్రధానంగా అగ్నిదేవత, మిత్రావరుణులు, ఇంద్రుడు, పవమాన

సోమ దేవతలకు చెందిన స్తుతులు ఉన్నాయి.

**రెండవ ప్రపాఠకము :**

ఇందులో 12 దశతులు ఉన్నాయి. ప్రధానంగా పవమానుడు, సోముడు, అగ్ని, మిత్రావరుణులు, ఇంద్రుడు మొదలైన దేవతలకు చెందిన స్తుతులు ఉన్నాయి.

**మూడవ ప్రపాఠకము :**

ఇందులో 14 దశతులు ఉన్నాయి. ప్రధానంగా పవమానుడు, సోముడు, అగ్ని, ఇంద్రాగ్నులు మొదలైన దేవతలకు చెందిన స్తుతులు ఉన్నాయి.

**నాల్గవ ప్రపాఠకము :**

ఇందులో 13 దశతులు ఉన్నాయి. ప్రధానంగా పవమానుడు, సోముడు, అగ్ని, ఆదిత్యుడు, విశ్వేదేవతలు, ఇంద్రుడు మొదలైన దేవతలకు చెందిన స్తుతులు ఉన్నాయి.

**ఐదవ ప్రపాఠకము :**

ఇందులో 21 దశతులు ఉన్నాయి. ప్రధానంగా పవమానుడు, సోముడు, అగ్ని, ఇంద్రుడుమొదలైన దేవతలకు చెందిన స్తుతులు ఉన్నాయి.

**ఆరవ ప్రపాఠకము :**

ఇందులో 15 దశతులున్నాయి. ప్రధానంగామిత్రాదిదేవతా గణాలను స్తుతిస్తున్నది.

**ఏడవ ప్రపాఠకము :**

ఇందులో 11 దశతులు ఉన్నాయి. ప్రధానంగా ఇంద్ర, పవమాన, సోమ, అగ్ని, విశ్వేదేవతాది గణాలను స్తుతిస్తున్నది.

**ఎనిమిదవ ప్రపాఠకము :**

ఇందులో 13 దశతులు ఉన్నాయి. ప్రధానంగా అగ్ని, విష్ణువు, వాయువు, ఇంద్ర, పవమాన, సోమ మొదలైన దేవతలకు చెందిన స్తుతులు ఉన్నాయి.

**తొమ్మిదవ ప్రపాఠకము :**

ఇందులో 9 దశతులున్నాయి. ప్రధానంగా పవమానుడు, సోముడు, అగ్ని, మరుత్తుడు, సూర్యుడు మొదలైన దేవతలకు చెందిన స్తోత్రాలున్నాయి.

ఈ సామవేదముయొక్క ప్రధాన మంత్రద్రష్టలు 17 మంది ఋషులు, వశిష్ఠుడు, వామదేవుడు, భరద్వాజుడు, మేధాథితి, కణ్వుడు, విశ్వామిత్రుడు, గోతముడు, శునశ్శేపుడు, సౌభరి, జమదగ్ని, ప్రస్కణ్వుడు, నృమేథుడు, ప్రాగాథుడు, కశ్యపుడు, రేభుడు, అత్రి వాలఖిల్యులు.

ప్రధాన దేవతలు 8. అగ్ని, ఇంద్రుడు, సోముడు, ఉషస్సు, సూర్యుడు, విష్ణువు, ఋతువులు, పురుషుడు.

సామవేదం సర్వేశ్వరుడైన పరమాత్మను సంగీతమయమైన స్తుతిచే కీర్తిస్తున్నది. అది భక్తులను ఆనంద పరవశులను చేస్తున్నది. సంగీత శాస్త్రమంతా సామవేదంలోనుంచే వచ్చింది. 'నారదీయ శిక్ష' అనే సంగీతశాస్త్రంలో సామవేదాన్ని గానంచేసే అనేక గేయాలు వ్రాయబడ్డాయి. సామ సప్త స్వరాలు వేణుగానంలో వరుసగా 'మ, గ,రి,స, ని,ధ,ప' అనే స్వరాలకు సరిపోతాయి. వేణుగానలోలుడైన శ్రీకృష్ణుడు **'వేదానాం సామవేదోఽస్మి'** అని తన స్వరూపంగా సామవేదాన్ని పేర్కొన్నాడు. నేటి ప్రపంచానికి అందుబాటులో ఉన్న సంగీతవిద్యకు మూలం సామవేదమే. ఇందలి గానవిద్యలో సహస్రాంశం కూడా ఈనాడు మనం గమనించలేని స్థితిలో ఉన్నాం. సామగానంచేత ప్రాచీనులు పశుపక్ష్యాదులన్నిటినీ తమ వశంలో ఉంచుకొని ప్రకృతితో చక్కని అనుబంధాన్ని కలిగి ఉండేవారు. నేడు సామగానంపై పరిశోధనలు అనేకం

జరుగుతున్నాయి. దీనితో రోగాలు నయం అవుతున్నాయని, వాతావరణంలో ఆరోగ్యకరమైన మార్పులు ఎన్నో జరుగుతున్నాయని నిరూపితమౌతున్నది. సంగీతం పట్ల ప్రేమ-మక్కువ ఉన్నవారి మానసికశాంతిని, తద్వారా వారు పొందుతున్న అభ్యుదయాన్ని విశ్లేషిస్తున్నారు.

పూర్వం తుంబురునారదాది ఋషులు తమ సామగానంచేత యుద్ధవీరులను తన్మయులను చేసి ఆవేశంతో, అవివేకంతో వారు చేయుచున్న యుద్ధాలను ఆపివేయగలిగినారు. రక్తపాతాన్ని నిరోధించి శాంతిని నెలకొల్పినారని ప్రాచీన వాఙ్మయం తెలియజేస్తున్నది.

పూర్వకాలంలో యజ్ఞయాగాదులందు సోమపానం, సామగానం తప్పక ఉండేవి. సోమలతను గురించి శాస్త్రాలలో చాలా విశేషంగా చెప్పబడింది. కాని, అది ఇప్పుడు లభించుటలేదు. ఇక సామగానం కూడ లుప్తప్రాయంగా ఉన్నది. సామవిద్వాంసులు కొద్దిమందే ఉన్నారని తెలుసుకున్నాం. వారిని రక్షించుకొనివారిద్వారా ఈ విద్యను ప్రచారంలోకి తేవలసిన అవసరం ఎంతైనా ఉంది.

సామవేదానికి ఉపాసనాపరంగా ఆధ్యాత్మికార్థాన్ని చెప్పుకున్నా ఆధిభౌతిక, ఆధి దైవికార్థాలను కూడా చెప్పుకొని భౌతిక సామాజిక విజ్ఞానాన్ని పొందవచ్చు.

(సశేషం)

---

➢ 9 వ పేజి తరువాయి ......

**6) చండికా** : 6 వ రోజు పూజించే 7 సం॥ బాలిక

**పూజా ఫలం** : సకలైశ్వర్యసిద్ధి

**7) శాంభవీ** : 7వ రోజు పూజించే 8 సం॥ బాలిక

**పూజా ఫలం** : సకల శోక దారిద్ర్య నాశనం, విజయప్రాప్తి

**8) దుర్గా** : 8వ రోజు పూజించే 9 సం॥ బాలిక

**పూజా ఫలం** : ఇహపరసౌఖ్యం

**9) దుర్గా** : 9వ రోజు పూజించే 10 సం॥ బాలిక

**పూజా ఫలం** : సర్వాభీష్ట సిద్ధి

ఈ కుమారీపూజను చేయడం వలన ఇహపర సౌఖ్య ప్రదాయిని అయిన అమ్మ సంప్రీతురాలై సర్వశుభాలను ప్రసాదిస్తుంది.

కలియుగంలో కోరికలు తీరడానికి దుర్గాపూజ శ్రేష్ఠమైనది. నవరాత్రులలో విధివిధానంగా దుర్గాపూజ చేయడం వల్ల శాంతి లభించడమే గాక విశేష ఫలం ప్రాప్తిస్తుంది.

నవదుర్గల వైశిష్ట్యం బ్రహ్మదేవుడు - మార్కండేయ మహామునికి వివరించారు.

**నవదుర్గా స్తోత్రము**

**ప్రథమం శైలపుత్రీ చ ద్వితీయం బ్రహ్మచారిణీ।**
**తృతీయం చంద్రఘణ్టేతి కూష్మాణ్డేతి చతుర్థకమ్॥**
**పంచమం స్కంధమాతేతి షష్ఠం కాత్యాయనీతిచ।**
**నవమం సిద్ధిదా ప్రోక్తా నవదుర్గా, ప్రకీర్తితాః ॥**

నవదుర్గలుగా నామాలలో భేదం వున్న అన్నీ ఒకే దుర్గాంశలే. అనేక రూపాలలో ఆమెను సేవించినా అన్ని రూపాలు అమ్మవే అన్న ఎరుక ఉండాలి.

**శక్తివంతమైన నామం 'దుర్గా' నామము.**

**ద్ - దైత్యనాశకము; ఉ - విఘ్ననాశకము,**

**ర్ - రోగనాశకము; గ- పాపనాశకము.**

నవరాత్రులలో నిరంతరం అమ్మ నామాన్ని స్మరిస్తూ శక్తివంతులమౌదాం.

అమ్మ దయవుంటే - అన్నీ ఉన్నట్లే.



# దేవీ విజయం

... గోనుగుంట మురళీకృష్ణ

ఆకాశం మేఘావృతమైవుంది. నల్లటి మబ్బులు కమ్మి పట్టపగలే చీకట్లు ముసురుకుంటున్నాయి. చూస్తూండగానే వర్షం మొదలైంది. చిటపట చినుకులతో మొదలయి, జల్లుగామారి వెనువెంటనే ఉప్పెనలా మారింది. అరణ్యంలో జంతువులు పరుగుపరుగున కొండగుహలలో దాక్కుంటున్నాయి. పక్షులు గూళ్ళలో దూరాయి. ఉడుతలు తడిసి ముద్దయి చెట్లమీద పరుగెత్తుతున్నాయి. కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు మెరుస్తున్నాయి. గుండెలు గుభిల్లు మనేలా ఉరుములు ఉరుముతున్నాయి.

ఆ భీభత్స వాతావరణంలో కొండకొమ్ముపై కూర్చుని ఏకదీక్షగా తపస్సులో ఉన్నాడు ఒక వ్యక్తి. అతని శరీరం శుష్కించిపోయి, జుట్టు జడలు కట్టి ఎన్నో ఏండ్లుగా తపస్సులో మునిగినట్లుగా ఉన్నాడు. ప్రకృతి చేసే భీభత్సకాండ అతడిని రవ్వంత కూడా కదలించలేకపోతూవుంది. అతనిపేరు మహిషాసురుడు. బ్రహ్మదేవుని గురించి తపోదీక్షలో వున్నాడు. అతని తండ్రి ఒక అందమైన మహిషిని చూసి మోహించాడు. ఫలితంగా జన్మించినవాడే ఈ మహిషాసురుడు.

ఇంతలో ఆకాశం నుంచి హంసవాహనం క్రిందికి దిగివస్తూవుంది. దానిమీద విరించి ఆశీనుడైవున్నాడు. ఆయన రాకకు సంతోషించినట్లు ప్రకృతి కూడా శాంతించింది. "కుమారా! కళ్ళుతెరు!" అన్నాడు.

మహిషాసురుడు కళ్ళు విప్పాడు. అతని బక్కచిక్కిన శరీరం అదృశ్యమై, బలిష్టమైన దేహంతో, రెండుకొమ్ముల మధ్య కిరీటంతో రత్నాభరణాలతో, పట్టువస్త్రాలతో కనిపించింది. "పద్మసంభవా! ప్రణామం"' అంటూ పాదాలకు నమస్కరించాడు.

"నీ తపస్సుకు మెచ్చాను. నీ అభీష్టం నెరవేర్చటానికే వచ్చాను. ఏం వరం కావాలో కోరుకో!" అన్నాడు విరించి.

"తండ్రీ! నాకు మరణం లేకుండా వరం ప్రసాదించు" అన్నాడు మహిషుడు.

"పుట్టిన ప్రతి ప్రాణీ గిట్టక తప్పదు. కనుక మరేదైనా వరం కోరుకో!" అన్నాడు బ్రహ్మ.

మహిషుడు ఒక్కక్షణం ఆలోచించాడు. "దేవ, దానవ,యక్ష, కిన్నెర, కింపురుషాదులలో ఏ పురుషుడూ నన్ను వధించలేనట్లు వరమివ్వు" అన్నాడు.

"తథాస్తు!" ఆశీర్వదించి బ్రహ్మ అదృశ్యుడయ్యాడు.

మహిషుడు తన రాజ్యం వెళ్ళాడు. గురువు శుక్రాచార్యుడికి బ్రహ్మ ఇచ్చిన వరాలను తెలిపాడు. ఆయన సంతోషించి, "మూడు లోకాలలో నీకు ఎదురులేదు. వెంటనే విజయయాత్రకు బయలుదేరు" అని ఆదేశించాడు. మహిషుడు యుద్ధసన్నద్ధుడయ్యాడు.

ఆ వార్త వినగానే భూలోక, పాతాళ లోకాధిపతులు ముందుగానే శరణాగతులయ్యారు. ఇక మిగిలింది దేవలోకం.

మహిషాసురుడు సేనాపతిని పిలిపించి, "నీవు అమరావతికి వెళ్ళి ఇంద్రుడిని కలుసుకుని నా మాటగా చెప్పు. నీవు రాజ్యం అప్పగిస్తావా ?

యుద్ధానికి వస్తావా ? అని అడిగి జవాబు తెలుసుకుని రా!'' అని ఆజ్ఞాపించాడు. ''చిత్తం'' అని తలవంచి నమస్కరించి వెళ్ళిపోయాడు. సేనాపతి మాటలు వినగానే దేవేంద్రుడు మండిపడి ''అమరావతిని ఎట్టి పరిస్థితులలోను స్వాధీనం చేసేది లేదు. యుద్ధానికి రమ్మని చెప్పుపో!'' అన్నాడు.

సేనాపతి చెప్పిన వార్త వినగానే మహిసుడు సేనలను వెంటబెట్టుకుని వచ్చి అమరావతిపై దండెత్తాడు. పోరు ఘోరంగా జరిగింది. ఆ సమయంలో ఇరుపక్షాల నుంచీ ఎగసిన బాణాల జడివాన భూమ్యాకాశాలను కప్పివేసింది. మహిషుడి ధాటికి ఆగలేక చివరకు సురసైన్యం పలాయనం చిత్తగించాడు.

---

''రమావల్లభా! శరణు శరణు! నీవు దక్క మాకు దిక్కులేదు.'' అంటూ ఇంద్రుడూ, వరుణుడు, యముడు వంటి దిక్పాలకులందరూ వైకుంఠం వచ్చారు.

శ్రీమహావిష్ణువు శేషపానుపుపైన పవళించి ఉన్నాడు. లక్ష్మీదేవి ఆయన పాదాలు వత్తుతూంది. ''దేవేంద్రా! ఏమిటిలా వచ్చారు ? అందరూ కలసి వచ్చారంటే ఏదో విశేషం ఉండే ఉంటుంది. ఏం జరిగింది? '' అని అడిగాడు.

''నీకు తెలియనిది ఏముంది దేవా ? మహిషాసురుడు దేవలోకంపై దండెత్తి వచ్చి అమరావతిని స్వాధీనం చేసుకున్నాడు. దేవతలకు తలదాచుకునేందుకు తావు లేకుండా పోయింది వెండికొండకు పోయి ఈశ్వరునికి మొరపెట్టుకున్నాము. ఆయన బ్రహ్మదేవుని అడగమన్నాడు. మహిషుడు నా భక్తుడు, భక్తునితో యుద్ధం చేయనని బ్రహ్మ అన్నాడు. అందుకే మీ దగ్గరకు వచ్చాము'' అన్నారు.

''బ్రహ్మ మహిషునికి వరం ఇచ్చేటపడు ఏ పురుషునివల్లా చావులేకుండా కోరుకున్నాడు. కాబట్టి అతడిని వధించటం నాకు కూడా సాధ్యంకాదు.మనం అందరం మన అంశలతో ఒక స్త్రీని సృష్టిద్దాం. స్త్రీ చేతిలో మరణం రాకూడదని కోరుకోలేదు కనుక ఆమే అతడిని వధించగలదు'' అని ఉపాయం చెప్పాడు మహావిష్ణువు.

అందరూ సరేనన్నారు. విష్ణువు తలచుకోగానే బ్రహ్మ, శివులు ప్రత్యక్షమయ్యారు.

శివుని నుంచీ శ్వేతవర్ణంలో ఉన్న తేజస్సు వెలువడింది. అలాగే మిగిలిన దిక్పాలకుల నుంచీ వివిధ వర్ణాలతో తేజస్సులు వెలువడ్డాయి. అవన్నీ కలసి ఒక దివ్యతేజోరాశియైన సౌందర్యమూర్తి అవతరించింది. ఆమె చంద్రబింబం వంటి ముకం, పద్దెనిమిది చేతులు, నల్లకలువలు వంటి నయనాలు కలిగివున్నది.

''ఈమె మహాలక్ష్మి. చూడటానికి ఒకే రూపంలో వున్న ఆయా పనులకు తగినట్లుగా నానా రూపాలు ధరిస్తుంది. సురలారా! మీరంతా ఆయుధాలు సృష్టించి ఇవ్వండి. మహాలక్ష్మీ! నీవు మహిషాసురుడిని మర్ధించి వీరందరకీ ఆనందం కలిగించు'' అన్నాడు శ్రీమహావిష్ణువు.

''ఆజ్ఞ'' అన్నది దేవి.

అగ్ని అతివేగం కల శక్తి అనే ఆయుధాన్ని సృష్టించి ఇచ్చాడు. వాయువు వజ్ర అనే ఆయుధాన్ని ఇచ్చాడు. యముడు దండాన్ని, కమండలాన్ని, బ్రహ్మ ఖడ్గాన్ని, డాలును, విశ్వకర్మ పరశువును, విష్ణువు చక్రాన్ని, శివుడు శూలాన్ని, వరుణుడు శంఖాన్ని, సూర్యుడు తన కిరణ పుంజమును సృష్టించి ఇచ్చాడు.

పద్దెనిమిది చేతులతో పద్దెనిమిది రకాల ఆయుధాలను ధరించి ''సురలారా! ఆ మహిషుడినీ, వాడి బలగాన్నీ చీల్చి చెండాడి వస్తాను. ఇక మీకు

మంచి రోజులు వచ్చాయి. నిశ్చింతగా ఉండండి'' అని ఒక చిరు నవ్వు నవ్వి అట్టహాసం చేసింది శ్రీదేవి. ఆ ధ్వనికి కులపర్వతాలు మారుమ్రోగాయి. భూమి కంపించింది. సముద్రాలు ఘూర్ణిల్లాయి. ఎక్కడో వున్న మహిషుడికి ఆధ్వని వినిపించింది.

"ఏమిటా శబ్దం ? వాడెవరో తెలుసుకొని రండి. వాడికి పోగాలం దాపురించిందనుకుంటాను'' అని సేవకులను ఆజ్ఞాపించాడు.

మహిషుని సేవకులకు భద్రకాళి రూపంలో వున్న మహాలక్ష్మిని చూడగానే గుండెలు గుభిల్లుమన్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులంకించుకున్నారు. "ప్రభూ! ఆమె ఒక స్త్రీ. ఆమె పెద్ద సింహం మీద కూర్చుని ఉంది. పద్దెనిమిది చేతులతో ఆయుధాలు ధరించి వున్నది. కళ్ళు చంద్ర నిప్పులవలె వున్నాయి. ఆమెను చూడగానే వణుకు పుట్టి పరుగెత్తుకుని వచ్చాము'' అని వివరించారు.

వారు ఆ మాట చెపుతూ ఉండగానే కోటబయట నుంచీ దిక్కులు పిక్కటిల్లేటట్లు శంఖనాదం వినిపించింది. మహిషుడు ఆయుధాలు ధరించి సైన్యసమేతంగా బయటకు వచ్చాడు. ఆమెను చూడగానే వాడు బెదరలేదు. "భువనైక సుందరీ! బ్రహ్మవరప్రసాదిని, మహావీరుడను ఒక ఆడదానితో యుద్ధమా! నీ సౌందర్యానికి మెచ్చాను. నన్ను పతిగా అంగీకరించు. నీవు కోరిన రూపం ధరించి నిన్ను అలరిస్తాను'' అన్నాడు.

"ఓరీ! దున్నపోతా! నీకు ఇంత అహంకారమా! ప్రాణాల మీద ఆశ ఉంటే స్వర్గ, మానవలోకాలను నాకు అప్పగించి పారిపో!లేదా నీ కొమ్ములు విరిచి పొగరు అణిచేస్తాను'' అని హుంకరించింది భద్రకాళి.

మహిషుడు ఆగ్రహంతో సైన్యాలను పురికొల్పాడు. వారంతా ఆమెమీద బాణవర్షం కురిపించారు. ఆమె తన బాణాలతో వాటిని మధ్యలోనే తుంచివేసింది. మహిషుడు ఖడ్గం విసిరేశాడు. ఆమె ఒక నిశిత శరంతో దాన్ని రెండు ఖండాలు చేసింది. అతడు గదాపాణియై పరుగెత్తిరాగా దేవికూడా గదను ధరించి ఒక దెబ్బ వేసింది.

ఆ దెబ్బతో మహిషుడు దిమ్మ దిరిగి కిందపడ్డాడు. ఒక్కక్షణంలో తేరుకుని శూలం ప్రయోగించాడు. అలా మహిషుడు వివిధ ఆయుధాలతో పోరు సలిపాడు. జగజ్జనని అవన్నీ తుత్తునియలు చేసింది.

చివరగా ఆ జగన్మాత ఒక్క సింహనాదం చేసి దివ్యతేజోరాశియైన చక్రాన్ని ప్రయోగించింది. కోటి సూర్యుల ప్రచండ తేజస్సుతో మీదికి వస్తున్న చక్రాన్ని చూసి మహిషుడు భయంతో వెనక్కు అడుగు వేశాడు. ఆ చక్రం ప్రచండ వేగంతో వచ్చి మహిషుని కంటం తెగనరికింది. మహిషుడు పెడబొబ్బ పెట్టి శిఖరం తెగిన కొండలాగా నేలకు ఒరిగాడు. ఇదంతా చూస్తున్న దేవతలు జయ జయ ధ్వానాలతో పుష్పవర్షం కురిపించారు. చావగా మిగిలిన మహిషుడి సైన్యం ప్రాణభయంతో పరుగులంకించుకున్నారు.

ఇంద్రుడు, వరుణుడు, అగ్ని మొదలైన దేవతాగణం వచ్చి జగన్మాతకు మొక్కి అంజలి ఘటించారు.'' అమ్మా! దుష్ట శిక్షణ, శిష్టరక్షణ కోసమే నీవు అవతరించావు. మహిషాసురుడిని సంహరించి మాకు ప్రాణం పోశావు. నిన్ను సర్వకాల సర్వావస్థలలోనూ పూజిస్తూ ఉంటాము'' అంటూ స్తోత్రం చేశారు.

భద్రకాళి శాంతించి "ఇక మీరు సుఖంగా మీమీ నివాసాలను స్వాధీనం చేసుకుని ఉండండి. ఇంకే దురవస్థ వచ్చినా నన్ను స్మరించండి. నేను వచ్చి రక్షిస్తాను'' అని అభయమిచ్చింది.

దేవతలందరూ కైమోడ్చి వెనుదిరిగారు.

(మూలం : దేవీ భాగవతం - రచనా సంవిధానం నా స్వంతము) □

శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి రచనల్లో విశిష్ట రచన

# వీరకాళికాంబా శతకము

భావచ్ఛందోఽనుసరణ: కీ.శే. డా॥ వి.వి.యల్.నరసింహారావు (కందిమల్లయ్యపల్లె) బ్రహ్మంగారి మఠం ఆస్థాన కవి

## 26. తృష్ణాక్షయం

**పెద్ద యోగులమని వేషముల్ దాల్తురు**
**ఆస తీరదయ్యె దాసరులకు**
**తరముగాదు చేయ దాసోఽహ మనునది**
**కాళికాంబ! వీర కాళికాంబ! 439**

యోగి అంటే చిత్తవృత్తుల్ని అదుపుచేయగలవాడు. దృఢంగా చిత్తాన్ని అదుపు చేసుకోగలవారే పెద్ద యోగులు. కాషాయాంబరాలు ధరించినంత మాత్రాన చాలదు. వైష్ణవ భక్తులైన దాసరులున్నారు. వారు కూడా ఆశలు చంపుకోలేరు. ఆశల్ని తీర్చుకోనూ లేరు. 'ఓ మహావిష్ణూ! నేను నీ దాసుణ్ణి దాసోఽహమ్' అన్నంత మాత్రాన దాసలక్షణం నెరవేర్చినట్లు కాదు. ఆచరణలో అది సాధ్యం కావాలి.

**జంగముల మటంచు లింగాలు కట్టుట**
**శివము లెత్తు ఆట చెడ్డరంతు**
**ఆచరణ మనునదె అరుదయ్యె భక్తిలో**
**కాళికాంబ! వీర కాళికాంబ! 440**

మెడకు లింగం కట్టుకునే శివభక్తులైన జంగాలున్నారు. ఆవేశంతో 'దశ్శరభ, దశ్శరభ' అంటూ తాళబద్ధంగా చిందులు వేస్తారు. అది ఒక రంతు - క్రీడ. మనసులో శివభక్తి కూడా అంతగా కుదురుకొన్నదా? అంటే అనుమానమే. చేసి చూపితేనే ఆచరణ జరిగినట్లు అందాక అది వాచావేదాంతమే.

**పానకమ్ము త్రాగి పూనకమ్మెత్తుట**
**మ్రాకులకును మ్రొక్క మాయ సుమ్ము**
**చిరములోన నున్న పరశివు గనవయా**
**కాళికాంబ! వీర కాళికాంబ! 441**

పానక మంటే బెల్లం కలిపిన నీరు. అది త్రాగినంత మాత్రాన ఆవేశంతో ఒళ్లు పరవశిస్తుందనుకోలేము. భక్తితో మనసు పరవశించాలి. అప్పుడు వచ్చేదే నిజమైన పూనకం. తక్కిన పూనకాలన్నీ మద్యం తాగినందువల్ల వచ్చే పూనకాలే. చెట్లకు పూజచేయటం కూడా చిత్తశుద్ధికి నిదర్శనం కాదు. ఆత్మలో ఉన్న పరమశివుడు చిరకాలంగా జీవుని ఆత్మలోనే ఉన్నాడు. జీవుడు ఆ పరశివుణ్ణి దర్శించగలిగితే మోక్షానికి సులభమౌతుంది అంతే.

**నీట మునక వేత నిప్పుతో చెలగాట**
**చప్పటలు చఱచుట సాధుతంతు**
**కీ లెఱిగిన పూజ కేవల భక్తియే**
**కాళికాంబ! వీర కాళికాంబ! 442**

నీళ్లలో మునకవేయడం, నిప్పులో దూకడం, చప్పట్లు చరుస్తూ భజన చేయడం భక్తులైన సాధువులు చేసే సాహసక్రియలే. ఇవి బాహ్యప్రదర్శనకు మాత్రమే ఉపకరిస్తాయి. భగవంతుడు మెచ్చేది నిజమైన భక్తి భావన మాత్రమే. అది ఆయువు పట్టైన భగవదర్చన. కీలెఱిగిన పూజ అంటే అటువంటి మనోగతమైన భక్తియే. (సశేషం)

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

(గత సంచిక తరువాయి)

**ఆచార్య - కుమారిలభట్టు సమాగమం**

ఆచార్యులు వ్యాసమహర్షి అనుమతితో దిగ్విజయ యాత్రకు సంకల్పించారు. చిద్విలాసీయం ప్రకారము ఆచార్యులు బదరీ నుండి కాశీకి వచ్చినప్పుడు ఆయనకు ఒకరు రత్నపాదుకలను, ఒకరు బంగారు కమండలాన్ని, కొందరు కాషాయ వస్త్రాలను, మరికొందరు ఏకాక్ష రుద్రాక్ష మాలలను, ముత్యాల సరాలను ఇచ్చారట. ఇలా ప్రజలు ఇచ్చిన వాటన్నిటినీ ఆచార్యులు చంద్రమౌళీశ్వర రత్నగర్భగణపతికి అర్పించేవారట. ఈ సంగతి తెలిసిన కాశీరాజు విలువైన కిరీటాన్ని, రత్న ఖచితమైన బంగారు కేయూరాన్ని, శ్వేతఛ్ఛత్రాన్ని, పల్లకిని, రెండు చామరాలను అర్పించి పుత్ర కళత్ర సపరివార సమేతంగా ఆయనను సేవించారట. ఆ రాజు 'పేరు రత్నసింహుడు' అని కూడా చెప్పబడింది. అప్పటి రాజుల ప్రోత్సాహము కూడా శంకర దిగ్విజయానికి కారణమన్న అభిప్రాయము కూడా వుంది. ఈనాటి మఠాధిపతులు కూడా ఇలాంటి గౌరవలాంఛనాలను గమనిస్తే ఆచార్యులకు అప్పట్లో అంతటి గౌరవ మర్యాదలు జరిగివుంటాయని భావించడంలో సందేహం లేదు. ఎంతో మంది ఆయన శిష్యులుగా మారడంతో ప్రజలలో కూడా ఆయన పట్ల గౌరవాదరాలు పెరిగి వుంటాయని భావించడంలో కూడా ఆశ్చర్యంలేదు.

**శివపాషండి పరాభవము :**

ఆచార్యులు ఇంకా కాశీనగరంలో వుండగానే ఆయనను వాదంలో గెలవడానికి అనేకమంది శివ పాషండులు వచ్చారని, ఆచార్యులు వారందరినీ ఓడించి లింగ, త్రిశూల, డమరుకాది చిహ్నాలు గల శివ పాషండులలోని దురాచారాలను తొలగించి అద్వైతులుగా మార్చారని చిద్విలాసీయంలోని, పదిహేనవ అధ్యాయంలో వ్రాయబడింది. అలాగే అనంతానంద గిరీయంలో కూడా శివసంకేతాలను ధరించిన ప్రతివాదులను ఆచార్యులు ఓడించారని చెప్పబడింది. ఈ ప్రస్తావన ఆనంద గిరీయంలో విపులంగా కనిపిస్తుంది. దీనిని బట్టి దక్షిణ భారతంలో తిలకధారణము, ఆయుధ ధారణ లాంటి సంప్రదాయాలు వుండేవని తెలుస్తుంది. బాహ్య వేషధారణను, బాహ్య ఆడంబరాలను నిలపటానికి ఆనందగిరి చాలా శ్రమపడ్డారని తెలుస్తుంది.

**కుమారిల భట్టు దర్శనం :**

ఆచార్య శంకరులకు తాము రచించిన భాష్యానికి కుమారిల భట్టు ద్వారా వార్తిక వ్రాయించాలని అభిలాష కలిగింది. అందువలన దక్షిణ దిక్కులోగల వింధ్యాచలానికి వచ్చి, అక్కడి నుండి ప్రయాగకు వచ్చారు. యమునానదిలో స్నానం చేసి కుమారిల భట్టును గురించి ప్రజల నుండి వివరాలు సేకరించి ఆయన్ను వెదకుతూ బయయలుదేరారు. కుమారిల భట్టు తాను చేసిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా అరణ్యంలో తన చుట్టూ పొట్టురాశి చేసుకొని నిప్పంటించుకొని శిక్షను అనుభవిస్తున్నాడని తెలిసి నరానరి అక్కడికే వెళ్ళాడు. కుమారిలభట్టు

ఆచార్యులను చూచి సంతోషంగా స్వాగతం పలికారు. శంకరులు కమండలంలోని నీటితో తుషాగ్నిని ఆర్పివేసి ఆయన సగం కాలిన శరీరానికి ఉజ్జీవనం చేయడానికి ప్రయత్నించబోయినప్పుడు కుమారిలభట్టు ఆపి మీరు భాష్య రచన చేస్తున్నారని విన్నాను. అందుకు వార్తిక వ్రాయించాలన్నది నా అభిప్రాయం అయితే నాకు ఆ అదృష్టంలేదు. బౌద్ధుల ద్వారా అధ్యయనం చేసిన నేను వారికి ధర్మద్రోహం చేశాను. జైమినీ ధర్మంలో అభినివేశం కలిగి కర్మద్వారానే ముక్తి అన్నదానిని స్థిరం చేయడానికి పరమేశ్వరుని నిరాకరించాను. ఈ రెండు తప్పులకు దేహాంత ప్రాయశ్చిత్తమే జరగాలి. ఫరవాలేదు. కర్మరుడైన నా శిష్యుడు మండనమిశ్రుని జయించగలిగితే అందరినీ జయించినట్లే అన్నారు. ఆచార్యులు అతనికి అద్వైతాన్ని ఉపదేశించి, అజ్ఞానాన్ని తొలగించి ఆకాశమార్గం ద్వారా మండనమిశ్రుని ఇంటివైపుకుప్రయాణం చేశారు.

**ఈ వృత్తాంతంలోని విషయాలను గమనించుదాం.**

కుమారిలభట్టు ఉత్తరదేశం వాడా ? దక్షిణదేశం వాడా ? అన్న ప్రశ్నకు సరియైన ఆధారం లేదు. డా॥ విద్యాభూషణ్ గారు వ్రాసిన 'భారత న్యాయశాస్త్ర చరిత్ర' ఆధారంగా బలదేవ ఉపాధ్యాయ అనే పండితుడు టిబెట్ దేశపు తారానాథ మొ॥ ఐతిహాసిక గ్రంథాలనుండి కొంత విషయాన్ని సేకరించాడు. దాని ప్రకారం కుమారిలభట్టు ధర్మకీర్తి అన్న రాజుకు బాబాయి. అతడు దక్షిణ భారతంలోని చూడామణి రాజ్యంలోని త్రిభునిలో పుట్టినవాడు. కుమారిలభట్టు శ్రీమంత గృహస్థుడై చూడామణి రాజు యొక్క గౌరవాదరాలకు పాత్రుడయ్యాడు. ధర్మకీర్తి కూడా కోరునందనుడనే బ్రాహ్మణ పుత్రుడు. బౌద్ధమతంపట్ల ఆసక్తి వుండటంచేత నలందా విద్యాపీఠంలోని స్థవిర ధర్మపాలుని దగ్గర బౌద్ధశాస్త్రాన్ని అధ్యయనం చేసి, బ్రాహ్మణ దర్శన జ్ఞానం కోసం కుమారిలభట్టు వద్ద చేరాడు. కుమారిల భట్టు భార్య అభిప్రాయం మేరకు ఇతర బ్రాహ్మణ శిష్యులతోబాటు అతనికీ అవకాశం ఇచ్చాడు. ధర్మకీర్తి శాస్త్రాధ్యయనం చేసి ప్రవీణుడై అక్కడున్న పండితులను తన వాదంతో ఓడించి, వారిని జయించి, ఆ తరువాత కుమారిలభట్టుతో కూడా వాదించి అతనిని కూడా ఓడించాడని, అందుకు పరిణామంగా కుమారిల భట్టు తన ఐదు వందల మంది శిష్యులతో బాటు బౌద్ధం స్వీకరించాడని వ్రాయబడింది.

ఈ కథను మనదేశంలో సమర్థించేవారు లేరు. అలాకాక భట్టు బౌద్ధ దర్శనాన్ని తెలుసుకోవడానికి బౌద్ధాచార్యుల మధ్య బౌద్ధబిక్షువు వేషంలోనే వున్నాడని మాధవీయంలో చెప్పబడింది. కుమారిలభట్టుకు ధర్మపాలుడై వుంటాడని శ్రీ ఉపాధ్యాయగారి అభిప్రాయం. భట్టు బౌద్ధాన్ని అభ్యసించే సమయంలో ఒకనాడు ఆ గురువు వైదిక మార్గాన్ని నిందించడం విని ఆయన కళ్ళలో నీల్ళు నిండుకున్నాయి. అది గమనించిన మిగిలిన శిష్యులు ఆయన బ్రాహ్మణుడేనని నిర్ధారించుకున్నారు. మంచి సమయం చూసి ఆయనను పై నుండి క్రిందకు తోశారు. 'వేదాలు ప్రమాణమైతే నాకే అపాయమూ కలుగకూడదు' అని భట్టు గట్టిగా అరిచాడట. 'ప్రమాదమైతే' అన్న సందేహాన్ని వ్యక్తం చేయడం వల్లనూ, ప్రచ్ఛన్న వేషంలో శాస్త్రాధ్యయనం చేయడంవల్లనూ, ఒక కన్నుపోయిందని మాధవీయంలోని వర్ణన చెబుతుంది.

ఈ రెండు సన్నివేశాలనూ గమనిస్తే ఆకాలంలో బౌద్ధులు, బ్రాహ్మణులు ఒకరి శాస్త్రాలను మరొకరు అధ్యయనం చేస్తూ వాదోపవాదాలు జరిపేవారని స్పష్టమౌతుంది. కుమారిలభట్టు దక్షిణదేశం

వాడనికూడా తెలుస్తుంది. కాని 'అనంతానంద గిరీయం'లో భట్ట ఉత్తరదేశం నుండి దుష్టమతావలంబులైన జైన బౌద్ధులను జయించారని, (భట్టాచార్యాఖ్యో ద్విజవరః కశ్చిత్ ఉదగ్దేశాత్ సమాగత్యా దుష్ట మతావలంబినో బౌద్ధాన్ జైనాన్ అసంఖ్యాతాన్ రాజముకాత్ నేక విద్యా ప్రసంగ భేదైః నిర్జిత్య... నిర్భయో వతణతే) అందువలన ఆయన ఉత్తరదేశం వాడని తెలుస్తూవుంది. శాలికానాధుడనే పండితుడు ఆయన ఉత్తరదేశంలోని వాడని చెప్పాడు. ఎందుకంటే 'వార్తిక కారమిశ్ర'. అన్నపేరు కూడా వుండటంచేత, మైధిలి బ్రాహ్మణుడని చెప్పబడటం చేత అతడు ఉత్తరదేశవువాడనే బలదేవ ఉపాధ్యాయులు' వ్రాశారు.

దక్షిణదేశంలో జైన బౌద్ధుల ప్రాబల్యం ఎక్కువ కావడంతో అనేకమంది బౌద్ధ విద్వాంసులు దక్షిణాది బ్రాహ్మణులుగా మారారన్న ఉదంతం ప్రకారం కుమారిల భట్టు దక్షిణదేశం వాడేనని కూడా నమ్మవచ్చు. కుమారిభట్టు యొక్క వేద ప్రామాణికతను ధర్మకీర్తి తన 'ప్రమావార్తిక'లో ఖండించాడు. ఇదే అభిప్రాయం గల రాహుల సాంకృత్యాయనుడి శ్లోకం ఇలా వుంది.

**అపౌరుషేయతాపీష్వా కర్తృణా మష్మృతే కిల ।**
**సంత్యస్యాప్యను వక్తార ఇతి ధిగ్ వ్యాపకం తమః॥**

ధర్మకీర్తి, కుమారిలభట్టు సమకాలికులు. కుమారిలుడికి మహాయానమే కాక హీనయాన బౌద్ధంతో కూడా పరిచయముంది. మ్లేచ్ఛులు ఉపయోగించే పదాలను కొంత మార్చి అర్థాంతర వాచకంగా ప్రయోగించారు. ఉదా : అతర్ (మార్గము) వయిర్ (పొట్ట). వీటిని బట్టి ఆయనను దక్షిణదేశంవాడేనని నమ్మవచ్చు. అంతేకాక 'మిశ్ర' అన్నపదం సంస్కృతంలో గౌరవసూచకం.

(సశేషం)

---

➢ 13 వ పేజి తరువాయి ......

**చింత్య! చింత్యా చింత్య! చిత్స్వరూప**
**జయపాద భక్తార్తి సంహారకారణ!**
**జయముకుంద ప్రియ! జయగిరీశ!**
**దివసమా పార్థ మాస సంధి స్వరూపా!**
**కల్పయుగవత్సరాధీన కాలఖేచరుండ!**
**రుండ! బహురూప! చండీశ! దండపాణి!**
**జయ! నమస్తే నమస్తే నమస్తే ప్రసన్నమూర్తీ!**

ఈ విధముగా పార్వతి ప్రార్థించగా శివుడు ముదుసలి బ్రహ్మచారి వలె వచ్చెను. పార్వతి నాశీర్వదించెను. నీ తండ్రి హిమవంతుడు రత్నములకు స్థానము. నీకు ఏ కొరతయునులేదు మరి నీవెందులకు తపమాచరించుచున్నావు ? అని పరాచకాలడెను. నీవు ఎవరినైనా ప్రేమించి తపస్సు చేయుచుంటివా ? అటులైన నేను బ్రహ్మచారిని. నా తపస్సుతో కొంత భాగమిచ్చెదను నన్ను పెండ్లి యాడుము అని అనెను. పార్వతి కోపించి వానిని నిందించెను. బ్రహ్మచారి శివుని పరిపరి విధముల నిందించాడు. నీ భర్త పాముల ధరిస్తాడు. విభూతి రాసుకుంటాడు, స్మశానంలో ఉంటాడు ఒక యిల్లా? వాకిలా ? ఎందుకీ శ్రమ ? నన్ను పెండ్లియాడమంటాడు. పార్వతి బ్రహ్మచారిని చివరకు శివునిగా యెఱింగి తన తపస్సు ఫలించిందని సంతసిస్తూ తల్లిదండ్రుల దీవెలనతో శివుని వివాహమాడుతుంది.

ఇదీ పార్వతి యొక్క తపస్సు .
సర్వేజనాః స్సుఖినోవంతు
సమస్త సన్మంగళాని భవంతు
ఓంశ్శాంతి శ్శాంతి శ్శాంతి
(మూలం : శ్రీనాధమహాకవి హరవిలాసం)

# యోగవాసిష్ఠ కథాలహరి

## లేడి - ఏనుగు - చేప - మిడత - తుమ్మెద

డా॥ ధారారామనాథశాస్త్రి, ఒంగోలు

అనగనగా ఒక మునిపల్లె. ప్రకృతి సౌందర్యం, వస్తుసమృద్ధి, ప్రశాంతత అక్కడ రాజ్యం చేస్తుంటవి. బహు ముని కుటుంబాలవారు అక్కడ స్థావరం ఏర్పాటు చేసుకొని నిరంతర యజ్ఞయాగాది క్రతువులతోను జపధ్యాన యోగనిష్ఠతోను కాలక్షేపం చేస్తూ ఆనంద భరితమైన జీవితాలు గడుపుతుంటారు. ఈ జీవన విధానం దీర్ఘ సత్రంగా తరతరాలు కొనసాగుతుంటే ఆ ఋషివాటి ఆనందవాటియై నైరంతర్యాన్ని పొంది ఒక మహాజ్ఞాన కేంద్రంగా విలసిల్లుతుండేది.

అందులో ఒక ముని కుటుంబంలో ఉద్దాలకుడు జన్మించి దినదిన ప్రవర్ధమానుడై నూనూగు మీసాలు యౌవనాని కీవల బాల్యాని కావల ఉన్న సంధిరేఖలో అడుగు పెట్టే ప్రాయాన ఓనాడు ఉన్నట్టుండి అసాధారణమైన వైక్లబ్యానికీ, అనంతమైన ఆవేదనకీ లోనైనాడు. ఈ సృష్టికి అర్థమూ పరమార్థమూ ఏమిటి ? ప్రతివాడూ సంసార బంధాలలో చిక్కుకొని చిక్కి నశించవలసినదేనా ? అన్యపంథా ఏమీలేదా ? ఇలాంటి ఎన్నో చిక్కుముళ్ల తన అంతరంగాన్ని మథించి వేయగా పితృపాదుల దగ్గరకు వెళ్ళి ప్రణిపాతం చేసి ఇలా పరిప్రశ్న చేశాడు. 'నాన్నగారూ! అంతరంగ మథనంతో అల్లకల్లోలమవుతున్నాను. సందేహాలు ప్రభవిస్తున్నవి. కాని సమాధానాలు దొరకడం లేదు. ఉదాహరణకి...' పితృపాదులు అర్థోక్తిలో ఆపి 'చిరంజీవీ నీ సందేహాలు నాకు అవగతమైనాయి. కాని సమాధానాలు నా దగ్గర లేవు. మేమంతా మా పూర్వ మునీంద్రుల పరంపరను అనుసరిస్తూ అందులోనే జీవిత సార్థ్యక్యాలను వంటకు తెచ్చుకుంటున్నాము. మాకెప్పుడూ సందేహాలు కలుగలేదు. జీవితాలు ఘంటాపథాన సాగిపోతున్నవి. మరి నీ సందేహాలకి సమాధానం నీ కృషివల్లే లభిస్తుంది. ప్రయత్నించు. విజయీభవ' అంటూ వీడ్కోలు చెప్పి పంపగా ఉద్దాలకుడు పూనికతో మహారణ్య మధ్యానికి చేరుకొని తపోనిష్ఠ అవలంబించాడు. కాలం గడుస్తున్నది. పదేపదే తపో దీక్షితుడైన ఉద్దాలకుని మనస్సులో ముర్మరిస్తున్నది ఒక ప్రశ్న :

దేనియందు విశ్రమించడం చేత జీవుడు మరల ఎన్నటికీ దుఃఖాన్ని పొందడో, దేనిని పొందడం చేత మనుష్యునికి మరల జన్మతో సంబంధము కలుగదో అట్టి వస్తువేది ?

ఒకనాటి ప్రాతఃకాలం ఉద్దాలకుడు తపశ్చర్యలోని కాఠిన్యానికి ఇంచుకంత యీవలకు వచ్చి ప్రశాంత మనస్కుడై తనచుట్టూ ఉన్న ఆరణ్యక ప్రకృతి సౌందర్యసీమలను అవలోకిస్తూ ఆనందిస్తూ తన్మయుడవుతున్నాడు. ఎన్నో అందాలు ఆనందాలు, రంగాలు, అంతరంగాలు, దృశ్యాలు, దర్పణంలో ప్రతిబింబించిన విశ్వము యొక్క విభిన్నవైభవాలు, అలాఅలా కలల్లాగ కమనీయ కామనలాగ కళ్లముందు కదలిపోతున్నవి. తాను మాత్రం సాక్షీభూతుడై చూస్తున్నాడు.

ఓ పొదరిల్లు. దానిమాటున పొంచి ఓ బోయవాడు మనోహరమైన సంగీతాన్ని ప్రసారం చేస్తున్నాడు. అల్లంత దూరాన అందాలు గూడుకట్టుకొన్న కళ్లతో రిక్కించుకొన్న చెవులతో ఒక లేడి శబ్దాను సారిణియైన బుద్ధిచే సంగీతం పట్ల ఆకర్షింపబడి బోయవాడు పన్నిన

వలలో చిక్కుకున్నది.

ఓ కీకారణ్య మధ్యంలో గజరాజు శీతల కోమల సుఖదాయకమైన స్పర్శను కోరి స్పర్శోన్ముఖమైన బుద్ధితో తన త్వగింద్రియానికి తృప్తి కల్పించుకోవాలని ఆడ యేనుగును వెదుక్కుంటూ వెళ్ళి బంధంలో చిక్కుకున్నది.

రమ్యమైన ఆహారం కోసం రసనేంద్రియ రూపబుద్ధి చాపల్యంచేత ఒక చేప ఎరమీద ఆశపడి గాలానికి తగిలి చిక్కుకొన్నది.

ఒక మిడుత నానా విధ రూపములపై ఆశపడే నేత్రవృత్తి నాశ్రయించి అగ్నియందు చిక్కుకొన్నది.

ఒక తుమ్మెద సుగంధాన్ని ఆస్వాదించాలనే ఘ్రాణేంద్రియగత బుద్ధి ప్రలోభం చేత పద్మం దగ్గరకు వెళ్లి పద్మగర్భంలో చిక్కుకొన్నది.

ఈ చిక్కుకొన్న ప్రతిజీవి తనకొక ఆదేశాన్ని సందేశాన్ని యిచ్చినట్లు భావించి ఉద్దాలకుడు హఠాత్తుగా తపశ్చర్య ముగించి ఇంటికి వచ్చి నాన్న గారితో అన్ని విషయాలూ చెప్పి నాకు కావలసిన సందేశం లభించింది అని ఆనందంతో అన్నాడు.

కొద్ది క్షణాలు మౌనం... ఉద్దాలకుని పితృపాదులు నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఇలా చెప్పారు.

'చూడు చిరంజీవీ! నీ పట్టుదల గొప్పది. నీ కృషి, తపశ్చర్య అంతకంటే గొప్పవి. నిన్ను మనసార అభినందించి ఆశీర్వదిస్తున్నాను. చాలా మంచి విషయాలు కేవలం శ్రుతపాండిత్యంలాగా కాక స్వయంకృషి చేత అర్థం చేసుకున్నావు.

మరి తరువాత కార్యక్రమం ?

నేను బ్రహ్మచర్యం అవలంభిస్తాను.

అంటే ?

పెళ్లిచేసుకోను.

పెళ్లి చేసుకోకుండా ఉంటావా ? బ్రహ్మచర్యం అవలంభిస్తావా ?

రెంటిల్లో ఏది నీ ఎంపిక ?

అదేమిటి నాన్నగారూ! అలా అంటున్నారు! రెండూ ఒకటి కాదా !

'ఉద్దాలకా! జాగ్రత్తగా విను. గృహస్థాశ్రమం స్వీకరించినవాడు బ్రహ్మచర్యం అవలంబిచవచ్చు. బ్రహ్మమార్గ సంచారి అనే అర్థంలో 'పెళ్లి' చేసుకోనివాడు తీరని కోరికల వలయంలో కొట్టుమిట్టాడుతూ బ్రహ్మజ్ఞానానికి దూరం కావచ్చు'.

వివరించండి.

'ఏమున్నది ఉద్దాలకా. చాలా చిన్న విషయం. నువ్వు తపస్సులో దర్శించిన లేడి - ఏనుగు - చేప - మిడత-తుమ్మెద తమ సహజ వాంఛల్లో ఇరుక్కుని నశించాయి. వాటివల్ల నేర్చుకోవలసిన పాఠం వాంఛ, అనుభవము సహజమైనవి కాని వానియందు చిక్కుకొని లోలుపత్వానికి గురియైంతే అవి పతనహేతువులు - అని. ఇప్పుడు ఆలోచించు ఉద్దాలకా! మేమంతా బ్రహ్మచారులం కాదా?'

'నా కళ్లు తెరిపించారు. మహాజ్ఞానాన్ని చిన్న మాటల్లో ఉపదేశించారు. మీ ఆశయం మేరకు గృహస్థుడనై మీ మార్గం అనుసరిస్తాను.

కథ విన్న శ్రీరాముడు గురువును ప్రశ్నించాడు. గురుదేవా చిన్నదైనా గుణమున మిన్నయైన కథ సెలవిచ్చారు. చిన్న సందేహం. ఒకానొక జ్ఞాని వ్యవహార తత్పరుడై యుండి కూడా సమాధిలో ఉన్నవాని వలె విశ్రాంతి పొందుతున్నాడు. మరొకడు ఏకాంతమును ఆశ్రయించి కేవలం సమాధియందే ఉన్నాడు. ఇద్దరిలో ఎవరు గొప్పవారు ?

'ఇద్దరూ సమానులే. కాని రెండవ వానికన్నా మొదటి వాడు మరింత శ్రేష్ఠుడు. ఎందువల్ల ? అతడు కర్తవ్య నిర్వహణ, జ్ఞాన సముపార్జనము రెండూ సమంగా నిర్వహిస్తున్నాడు. నీవు కూడా అలాగే జ్ఞానివై నీ క్షాత్ర కర్తవ్యాన్ని నిర్వహించు' అంటూ శ్రీ వసిష్ఠులు రాముని ప్రభోధించారు. □

గీతా సుధ



# భగవద్గీతకు భాసుర భాష్యం

డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

భగవద్గీతలో అత్యంత విశిష్టమైనదిగా ప్రాచుర్యంపొందిన పన్నెండవ అధ్యాయమైన భక్తియోగంలోకి అర్జునుడి పలుకులతో పాదం మోపుతున్నాం ఈ సంచికతో! నన్ను ఇంతగా ప్రోత్సహిస్తున్న కాలజ్ఞాన సుధాకరులైన సంపాదకులవారికి, నిర్వాహక వర్గం వారికి, పాఠకమిత్ర బృందం వారికి మనఃపూర్వక నమస్సులను అందచేస్తూ 12వ అధ్యాయాన్ని విశ్లేషించుకుందాం!!

తన ''సహస్రబాహూదరవక్త్రనేత్ర'' రూపమైన విశ్వరూపాన్ని ఉపసంహరించి, చతుర్భుజ రూపాన్ని చూపి, దాన్ని ఉపశమించి మళ్లీ "మామూలు" చలాకి అయిన బావను చూచిన బావమరిదికి మళ్లీ ఒక సందేహం వచ్చింది. "కృష్ణా నీ సేవలో నిమగ్నులైన వారా ? లేక నీ నిరాకార అవ్యక్త రూపాన్ని పూజించే వారా ? వీరిద్దరిలో ఎవరు యోగపరిపూర్ణులుగా పరిగణింపబడతారా ?'' అని అర్జునుడు కృష్ణుణ్ణి అడిగాడు.

**ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।**
**యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥ (12-01)**

ఇది చాలా సంబద్ధమైన సందేహం. దేవుడి పటం ముందో, విగ్రహం ముందో కూర్చుని "లొడలొడ" తెలియని పదాలను వల్లె వేసేవాడా, తనకు యిచ్చిన పనిలో, నిమగ్నుడై పనిలోనే భగవదాంశను చూచేవాడా... ఈ ఇద్దరిలో ఎవడు యోగి, ఎవడు శ్రేష్టుడు. దీని సమాధానం కూడా మనకు తెలుసు.

మానవుడా - మానవుడా
నీవు గొలుచు ఆ దేవుడు
ఆ తమిలో లేడుచూడు
ఆకోవెల వీడినాడు"

మరెక్కడున్నాడయ్యా... అంటే

రైతెక్కడ రాతినేల
పండించగ పడిదున్నునో
పథ నిర్మాణకుడెచ్చట
రాళ్లన్నీ పగులగొట్టి
బాటవేయ పరపించునో
అచ్చోటనె అచ్చోటనె
ఆ రైతుల స్వేదంలో
ఆ శ్రామికుల కష్టంలో
ఆనందం అందిస్తూ
ఆనందుని నందనుండు
అగుపిస్తాడోయి చూడు
అగుపిస్తాడోయి చూడు"

మనకందరికీ కలిగే సందేహమే మన అందరి ప్రతినిధి అయిన నరుడు (అర్జునుడు) శ్రీకృష్ణునిముందు వెలిబుచ్చాడు.

"ఓం నారాయనాయస్వాహా... పొద్దున్నే పేపరొచ్చిందో రాలేదో చూడండ్రా... ఓం మాధవాయస్వాహా.... అబ్బా పాలవాడు నీల్లు కలిపి ఛస్తున్నాడురా...

మధుసూదనాయనమః .... అచ్యుతాయ నమః ... వెధవామడికట్టుకున్నానురా నన్నంటుకోకు.... హరయేం శ్రీకృష్ణాయినమః.... కూరగాయలు మంచివి చూచి తీసుకోండిరా.... వెధవ పుచ్చులు కూడా కలిపి ఇస్తాడు జాగ్రత్త....'' ఇలా సాగే పూజకు విలువ ఏముంటుంది.... ఇలాంటి వాళ్లు పూజ చేయకపోవడం మంచిది. తమ తమ దైనందిన వ్యవహారాలు చక్కగా చూచుకోవడమే మంచిది. పూజమీద ధ్యాస నిలుపలేక, దైనందిన వ్యవహారాలు చూచుకోలేక రెంటికీ చెడ్డరేవడిలాగా అయిపోయి పరిపూర్ణులు కాలేరు. కనీసం లౌకిక వ్యవహారాలన్నీ చక్కబెట్టుకొనినా కూడా కొంత ఫలితం దక్కుతుంది. చాలా మందికి నేను ''దేవుణ్ణి పూజించ వద్దు'' అనే సలహాయిస్తుంటాను. కానీ అక్కడే ఆగిపోను ''దేవుణ్ణి పూజించవద్దు, దేవుణ్ణి ప్రేమించండి'' అంటాను. పూజించగడం అంటే ఏమిటి పైన చెప్పుకున్నట్లు ''నోటి లొడలొడ'' మాత్రమే అయితే శుద్ధ దండగ ''గుళ్లో కొబ్బరికాయ కొడితే ఒక చిప్పగుళ్లో ఇవ్వాల్సివస్తుంది. ఇంట్లో కొట్టుకుంటే రెండు చిప్పలూ మనకే ఉంటాయి'' అనుకునేవాల్లు చేసే పైపై పటాటోపాన్ని పూజ అనరాదు, అనుకోరాదు. మరి ప్రేమించడమంటే వెంటబడడమా, కాదంటే యాసిడ్ పోయడమా... అలా అనుకుంటే ప్రేమించనూవద్దు. కాని ''నిజమైన ప్రేమ'' అంటే అవతలి వ్యక్తికి ఇష్టమైన పని చేయడం'' కాబట్టి ''దేవుణ్ణి ప్రేమించండి'' అంటే దేవుడికి ఇష్టమైన పనులు చేయండి. సాటి జీవులను ప్రేమిచండి,సాటి మనుషులను ప్రేమించండి. గర్భగుడిలోకి వెళ్లి వందలకు వందలు కానుకలు సమర్పించుకునే వాల్లు గుడిబయట నిలబడ్డ అభాగ్యులమీద అనాధల మీద విసుక్కోవడం, కసురుకోవడం ఎంత వరకుసమంజసమోయోచించండి (అలాగని ఈ భాష్యకారుడు'' అడుక్కొవడాన్ని ప్రోత్సహిస్తున్నాడు'' అనుకోకండీ( (సందర్భం వచ్చింది కనుక చెబుతున్నాను. బిచ్చగాళ్లను చేరదీసి వాల్లల్లో సకలాంగులలోని అంతర్గత శక్తులను గుర్తించి వాళ్లతో మంచి పనులు చేయించాలని ఈ భాష్యకారుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాడు. వికలాంగులు కూడా చేయగలిగే పనులు చాలా ఉన్నాయి.

అందుకే అర్జునుడు ఆపద్భాంధవుణ్ణి ఆ విధంగా అడిగాడు. ''సేవ చేసేవారా ? పూజించేవారా'' ఎవరు విన్న దీనికి సమాదానంగానే ''ప్రార్థించే పెదవులకన్నా, సేవించే చేతులే మిన్న'' అని సకల మానవాళిని తల్లిలా ప్రేమించిన మదర్ థెరిస్సా అన్నారు.

దానికి కృష్ణుడు ప్రతిస్పందిస్తూ నానగుణా కారమును మనస్సులో నింపుకొని శ్రద్ధతో నన్ను (కర్మను) పూజించే వారు (ఆచరించేవారు) యోగ (కర్మ) వీరులని అన్నాడు.

**మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే।**
**శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః ॥ (12-02)**

అందుకే గీతకూడా సగుణోపాసనను నిరసించలేదు. మన అందరికీ అనుభవంలో వున్న ఒక విషయాణ్ణి పరిశీలిద్దాం. సూర్యుడు సర్వ వ్యాప్తంగా ఎండను ప్రసాదిస్తున్నాడు. ఎండ వేడిమికి ఏదైనా కాలిపోతుంది. కాని మీరు ఎండలో కొన్ని కాగితాలు వేయండి. 50 డిగ్రీలు ఎండ ఉన్నా కాగితాలు కాలిపోవు. కానీ ఆ ఆ కాగితాల మీద ఒక భూతద్దాన్ని పెట్టి సూర్యరశ్మిపడే విధంగా చేయండి. వెంటనే మంటలు ఉద్భవించి ఆ కాగితాన్ని తగులబెడతాయి.

ఇదే విషయాన్ని గీత ఎంత గొప్పగా వివరించిందో విశ్లేషించుకుందాం. ఎండవేడి అన్నిచోట్లా ఉన్నట్లే భవచ్ఛక్తి అన్ని చోట్లా వుంది. కాని దానిని ఒక రూపం అనే ''భూత అద్దం''లో కేంద్రీకరించడం వలన

(దేవుడు, దేవాలయం అని ఉండడం వలన) జీవిలోని శక్తియుక్తులన్నీ అక్కడే కేంద్రీకరించబడే పాపాలు (కాగితాలు) పటాపంచలవుతాయి (కాలిపోతాయి). అందుకే దేవుడి గుడికి వెళితే వున్న మానసిక ప్రశాంతత ఏ ఎమ్యూజెమెంట్ పార్కుకు వెళితేనో, ఏ సర్కస్‌కో, సినిమాకో వెళితేరాదు. కాబట్టి సగుణాకారునిగా దేవుణ్ణి పూజించడంలో తప్పులేదు. కానీ దేవుణ్ణి ప్రేమించడం ఇంకా గొప్ప. దేవాలయాలు, పూజా విధానాలు, భగవత్కల్యాణోత్సవాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే ప్రఖ్యాత ఫ్రెంచి సాంఘిక తత్వవేత్త పునరుజ్జీవన కర్త అయిన రబిలే వోల్టైర్ మహాశయుడు "దేవుడు లేకపోతే అతణ్ణి మనం ప్రతిష్ఠించాలి" ఇది ఎంతో ఆలోచనాత్మకమైన భావన. మనకు విజయం కలిగితే "ఇది భగవంతుని దయ" అనుకొని మనిషికి గర్వం రాకుండా ఉంటుంది. మనకు అపజయం కలిగితే "మన పని మనం చేశాం. భగవంతుడే చిన్న చూపు చూచాడు" అంటూ మరీ క్రుంగిపోకుండా మనల్ని మనవే సముదాయించుకోవడానికి, సంబాళించుకోవడానికి, అపజయం ఎందుకుపొందామో విశ్లేషించుకోవడానికి, అపజయ కారణాలు తొలగించుకొని మరలా విజయం పొందడానికి కృషి చేయడానికి "దేవుడు ఉన్నాడు" అనే భావన తోడ్పడుతుంది (ఆస్తికులు దేవుడు ఉన్నాడు అని ఎలా నిరూపించలేరో నాస్తికులు దేవుడు లేడు అని కూడా నిరూపించలేరు) దేవుడు ఉంటే పురుషుడా, స్త్రీనా, వృద్ధుడా, యువకుడా అనే మీ మాంసలు, అసలు ఉన్నాడా లేడా అనే వివాదాలు సమయాన్ని వృధా చేస్తాయే తప్ప ఎటువంటి ఫలితాలనూ ఇవ్వవు. "ఉదధి ఎట్లు ఘోషించునో, ఉర్వియేలకంపించునొ, మేఘమెట్లు గర్జించునో, వర్షమెట్లు వర్షించునో, దీనికి కారకు డెవ్వరు, అది మగువా? మగవాడా అందీ అందని సత్యం" అన్న కవివాక్కుకూడా గీతా సందేశమే. "తన సృష్టిని చేజేతుల తానే హరించు నతడు మానవుడా దానవుడా ఉద్రిక్తుడా ఉన్మత్తుడా" అని సంశయించడం కూడా హేతుబద్ధమే." దేవుడున్నాడు... గుడులు, మాడులు, పూజలు... మొదటి దశ మాత్రమే. దీనితోబాటు ఎవరు ఇంద్రియాలను నిగ్రహించి అందరి ఎడల సమాన బుద్ధి గలవారై అవ్యక్త రూపాన్ని సేవించటంలో (పూజించడంలో కాదు) మార్పులేని, స్థిరమైన, నిశ్చలమైన తత్త్వం కలిగి ఉంటారో వారు నీలోనే (పనిలోనే) సంతోషాన్ని పొందుతారు.

**యే త్వక్షరమనిర్దేశ్యమ్ అవ్యక్తం పర్యుపాసతే ।**
**సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్ ॥** (12-03)

ఎవరైతే సమబుద్ధి గలిగిఉంటారో, నారాకారస్వరూపాణ్ణి తెలుసుకోగలుగుతారో సర్వత్రా (ప్రతి పనిలోనూ)భగవంతుణ్ణీ చూడగలుగుతారో వారికి మోక్షం (ఆనందం) కలుగుతుంది.

**సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః।**
**తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః॥** (12-04)

కానీ అది అంత సులభంకాదు. కనిపించని విషయం మీద మనస్సు లగ్నం చేయడం చాలా కష్టం. "శ్వాస మీద ధ్యాస" కూడా చాలా కష్టమే. "మీ శ్వాసను మీరు గమనించండీ" అంటుంటారు ధ్యానులు. కానీ కనిపించని శ్వాసను గమనించడం కష్టమే (కానీ అసాధ్యం మాత్రం కాదు). (సశేషం)

- **విచక్షణలేని ఆచరణ వాసనలేని పూవు లాంటిది. అది చూచే వారికి బాగానే వున్నా తనకు మాత్రం ఆత్మతృప్తిని కలిగించదు. పైగా అది ఎన్నటికీ పూర్ణఫలితాన్ని ఇవ్వజాలదు.**

# దారిదోచే మన్నేటి వెంకట

... కట్టా నరసింహులు

ఏడుకొండల వెంకటరమణుని సన్నిధానం శేషాచల పర్వతం. ఆ కొండ మీద కొలువున్న స్వామిని దర్శించడానికి ప్రయాణం చేసే మార్గాలు మూడున్నాయి. తిరుపతి నుంచి కొండ మీదికి వెళ్లవచ్చు. అలాగే చంద్రగిరి ప్రాంతం నుంచి కొండ మీదికి వెళ్లవచ్చు. ఇవి సోపాన మార్గాలు. ఆధునిక కాలంలో రోడ్లు వేసుకున్నాం. బస్సుల మీద యితర వాహనాల మీద వెళ్తున్నాం. ఈ సౌకర్యాలు లేని రోజుల్లో నడిచే కదా వెళ్లేది! సోపాన మార్గాలు ఇందాక చెప్పిన రెండు కాకుండా మరో మార్గం కూడా ఉంది. దేశంలో చాలా భాగం యాత్రికులు ఈ మార్గం గుండా వెళ్లేవారు. అది కడప జిల్లాలోని శెట్టిగుంట నుంచి శేషాచలం కొండ మీదికి దారితీస్తుంది. ఈ బాటను పెద్దబాట అని కూడా పిలుస్తారు.

కడప జిల్లాలో కడప సమీపంలో దేవుని కడప ఉంది. అక్కడ కొలువైన దేవుడు వేంకటేశ్వరుడే. ఈ ప్రాంతంలోని ప్రజలు కడప వెంకటరమణ స్వామిని దర్శించి తరువాత తిరుమల యాత్ర చేస్తారు. కడప - ఒంటిమిట్ట - నందలూరు- రాజంపేట - కోడూరు నగరాలు దాటుకుంటూ శెట్టికుంట చేరుకొని అక్కణ్ణుంచి కొండపైకి నడిచేవారు.

యాత్రికుల కోసమే శెట్టికుంట ఏర్పడింది. వైశ్యులు, యాదవులు, ముత్తరాచలు అక్కడ ఉండేవారు. ముత్తరాచల్లో ఒక కుటుంబం యాత్రికులను దోపిడీ చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేది. ఆ కుటుంబంలో ముగ్గురన్నదమ్ములు. వారిలో పెద్దవాడు తిరుమల నాయుడు. తిమ్మనాయుడు అని కూడా పిలుస్తారు. వీళ్ల తరువాత తిమ్మనాయుని కొడుకు వెంకట అనేవాడు తయారయ్యాడు. వీళ్ల యింటిపేరు - మన్నేటి. మన్నేటి వెంకట తండ్రులకు మించిన దుర్మార్గుడు గాను, బలాఢ్యుడుగాను పేరు పొందాడు. మట్ల అనంతరాజు అనే ఎర్రగుంట్ల దొరను తరిమికొట్టింది ఈ మన్నేటి వెంకటే.

శెట్టికుంటకు తూర్పుగా పరుగు దూరంలో పొగడమాను దగ్గర కలుజులో మనుష్య స్థావరం ఏర్పాటు చేసుకొన్నాడు. అక్కడ కాపు పెట్టుకొని దారిన పోయే యాత్రికుల్ని వ్యాపారుల్ని కొల్లగొట్టడం మన్నేటి వెంకట వృత్తి. తన వద్ద పనిచేసే వాళ్లను అధిక సంఖ్యలో వుంచుకొని పోషిస్తూ ఉండేవాడు.

మట్లిరాజులు పాలిస్తున్న ఈ ప్రాంతాన్ని పులుగులనాడు అని పిలుస్తారు. అది దాటితే వచ్చేది చంద్రగిరి సీమ. ఈ రెండు ప్రాంతాలవారు మన్నేటి వెంకట దారుణాలకు బలి అవుతూ ఉండేవారు. చంద్రగిరి సీమలోని ఆర్కాటు నవాబుకు మన్నేటి వెంకట దుష్కార్యాలు తెలిశాయి. ఆయన దగ్గర ఆజ్ఞా పాలకుడు గోలుకొండ వ్యాపారి పోలూరి వరదప్ప పంతులు, నవాబు అనుమతితో కొంత సైన్యం తీసుకొని తిరుపతిలో ఉంటూ వచ్చాడు.

ఇలా ఉండగా ఉత్తర ప్రాంతం నుంచి శ్రీనివాసభట్టు అనే ఆయన భార్యా సహితంగా తిరుమల యాత్రకు బయలుదేరాడు. ఆయన భార్య వద్ద కొన్ని నగలున్నాయి. శెట్టిగుంట ప్రాంతంలో ప్రయాణిస్తూ ఉండగా మన్నేటి వెంకట తన జనాన్ని వెంటబెట్టుకొని ఆ దంపతుల మీద దాడి చేశాడు. ఆ నగలు దోచుకొన్నాడు. ఆ యమ్మ ఒంటిమీద పట్టుబట్టలున్నాయి. ఆ బట్టల మీద వెంకట కన్నుపడింది. ఆ బ్రాహ్మణ ఇల్లాలు వెంకటను వేడుకొంది. మాన సంరక్షణం చేయుమని

బ్రతిమాలింది. వెంకట ఆ తల్లి మాటలు పెడచెవిన పెట్టాడు. ఒంటిమీదున్న పట్టుబట్టలు లాగాడు. ఆ పుణ్యస్త్రీ శరీరం మీద ఆసక్తి విడిచింది. నేల మీద కుప్పకూలిన ఆమె పద్మాసనం వేసుకొని ఏడుకొండల వెంకటరమణునికి చేతులు జోడించి కూర్చుంది. ఆమె భర్త ఆ దుండగాన్ని అరికట్ట లేకపోయాడు. వెంకట దోచిన సొమ్ముతో వెళ్లిపోయాడు. శ్రీనివాస భట్టు తన పైపంచ ఆమెకు కప్పబోయాడు. ఆమె ఇవేవీ పట్టించుకోలేదు. శరీరం మీద ధ్యాస వదలింది. ఆ దారిలో తిరుమలకు వెళ్లే యాత్రికులు ప్రయాణం చేస్తుంటారు కదా! ఏమీ చేయలేని స్థితిలో శ్రీనివాస భట్టు తన భార్య చుట్టూ రాళ్లు పేర్చి గోడ కట్టాడు. ఆ విధంగా ఆమె మాన సంరక్షణ చేయగలిగాడు.

ఈ దుండగం చేసిపోయిన రాత్రి మన్నేటి వెంకట కలగన్నాడు. అదొక చెడ్డ కల. మరునాడు తన వారిని వెంటబెట్టుకొని దోచిన వస్తువులతో అక్కడికి వెళ్లాడు. పసుపు కుంకుమ రెండు చీరలతో వెళ్లి తన తప్పు మన్నించమని దోచిన వస్తువులను తిరిగి స్వీకరించమని కోరాడు. ఆ యమ్మ నోరు తెరిచి మాట్లాడితే కదా వాటిని తీసుకోడానికి, వద్దనడానికి. చేసేదేమీ లేక వెంకట వెనుతిరిగిపోయాడు.

సరిగ్గా ఇరవై దినాలకు బ్రాహ్మణ స్త్రీ కూడు నీళ్లు ఉగ్గపట్టి వైకుంఠం చేరుకుంది. ఆ సమీపంలోనే మరి రెండు దినాలకు శ్రీనివాస భట్టూ మరణించాడు.


పోలూరి వరదప్ప ఆర్కాటు నవాబు అనుమతితో తిరుపతి నుంచి బయలు దేరి అందుకు తగిన మనుషుల్ని వెంకట దగ్గరికి పంపాడు. వారు వెంకటతో మీతో మాట్లాడడానికి పోలూరు వరదప్ప పంతులు వస్తున్నాడని తెలిపారు. మన్నేటి వెంకట, పోలూరు వరదప్ప పంతులు శెట్టిగుంట- బాలుపల్లె సందున కురపబండల వద్ద సమావేశ మయ్యారు (శా.శ 1655 (క్రీ.శ. 1730) మార్గశిర మాసం). వరదప్ప తన మనుషుల్ని సమీపంలో దాచి ఉంచాడు. వరదప్ప తనకు తోడు ఒక్క మనిషిని మాత్రమే వెంటబెట్టుకొని వచ్చాడు. ఆ రోజు రెండు జాముల సమయం దాకా ఇద్దరూ మాట్లాడుకొన్నారు. వరదప్ప ఆర్కాటు నవాబు పంపగా వచ్చినట్లు, వెంకటకు కొన్ని పల్లెలు అమరంగా ఇస్తున్నట్లు, మరి కొన్ని పల్లెలకు కావలి రుసుం ఏర్పాటు చేస్తున్నట్లు నవాబు వర్తమానంగా వరదప్ప పంతులు చెప్పాడు. మళ్లీ కలుసుకుందాం విడిదికి వెళ్లిరమ్మని వరదప్ప వెంకటతో అన్నాడు. వెంకట గుర్రమెక్కి వెళ్లబోతున్న సమయంలో వరదప్ప తన వద్ద దాచుకొని వున్న కత్తి తీసి మన్నేటి వెంకట శిరస్సు ఖండించాడు. వెంకట అడ్డు తొలగింది. తన మందితో కలిసి తిరుపతికి వెళ్లిపోయాడు. ఈ ఘటన శ్రీనివాస భట్టు మరణించిన తరువాత జరిగింది.

శ్రీనివాస భట్టు దంపతులు మరణించిన చోట స్థానికులు రెండు కుంటలు నిర్మించారు. ఒక దానికి అయ్యగారి కుంట, మరొకదానికి అమ్మగారి కుంట అని పేర్లు పెట్టారు.

మన్నేటి వెంకటను హతమార్చిన పోలూరి వరదప్ప పంతులు కూడా ఎక్కువ నాళ్లు నిలవ లేకపోయాడు. వులుగుల నాటి సీమను ఎర్రగుంట్లలోని మట్లిరాజులు అణకువగా ఏలుకుంటూ వచ్చారు. మన్నేటి వెంకట దగ్గర విశ్వాస పాత్రుడుగా ఉండిన ఒక మాదిగవాడు తమ దొరను చంపిన వరదప్ప పంతులు మీద పగ తీర్చుకోడానికి ఎదురుచూస్తూ ఉన్నాడు. ఒకమారు వరదప్ప తిరుపతి నుంచి ఎర్రగుంట్ల కోటకు వస్తున్నాడని దారి కాచాడు. వరదప్ప పల్లకిలో నిద్రిస్తూ ఉండగా బోయలు పల్లకి మోస్తూ వున్నారు. శెట్టిగుంట బాలుపల్లె సందులో ఉన్నపాటున పల్లకి పైపడి మాదిగవాడు బల్లెంతో వరదప్ప పంతులును పొడిచి చంపాడు. చంపేటప్పుడు నేను మన్నేటి వెంకట కొలువుగాణ్ణి అని చెప్పి మరీ చంపాడు.

*ఆధారం : మెకంజీ కైఫీయత్తులు, కడప జిల్లా, మొదటి భాగం - కైఫీయ్యత్తు శెట్టిగుంట.* □

# శ్రీరామ భక్తి



## 7. భరద్వాజుని శ్రీరామ భక్తి

- కీ.శే డాక్టర్ రోహిణి వెంకట సుందరవరదరాజేశ్వరి

**మహామోహ మహిషేసు బిసాలా।**
**రామకథా కాలికా కరాలా॥**

జనులు భగవానుని మంగళ ప్రదమైన చరిత్ర వినినంతనే తాపములు నశించి శాంతి నొందెదరు. మాయతో గలిగిన కామక్రోధ లోభ మోహాది వికారములు తొలగిపోవును. ఇందువలన సత్ పురుషులు సదా భగవత్కథను వినుచు చెప్పుచు నుండెదరు. శ్రీహరి నిత్య దివ్యగుణములు హృదయమందున్న వారు విషయాసక్తులుగాక సమస్త లౌకిక భోగముల యందు విరక్తులై యుందురు. ఆనంద కందమగు ప్రభుని చరిత్ర కూడ ఆనంద రూపమే. వాని సుధా మధురిమలను ఒక్కమారు ఆస్వాదించిన మనస్సు ఇంకేదియుకోరదు.

దేవ గురువు బృహస్పతి సోదరుడు ఉతధ్యుని కుమారుడు భరద్వాజుడు. శ్రీరామకథా శ్రవణమున అనన్య రసికుడు. ఇతడు బ్రహ్మనిష్ఠుడు. శ్రోత్రియుడు, తపస్వి, పరమ భక్తుడు. తీర్థరాజమగు ప్రయాగ యందు గంగాయమునల సంగమమునకు కొద్ది దూరమున భరద్వాజుని ఆశ్రమము గలదు. వేలకొలది బ్రహ్మచారులు వీని దగ్గర విద్యాధ్యయనమునకు వచ్చి, గొప్ప విరక్తులై వీని చెంతనే యుండి, తమ అధికారాను సారము యోగము, ఉపాసన, తత్వాను సంధానది పారమార్థిక సాధన చేయుచు, ఆత్మ కల్యాణ ప్రాప్తికి నిరీక్షించుచుండెదరు. భరద్వాజునకు ఇద్దరు పుత్రికలుండిరి. వీరిలో ఒకరు యాజ్ఞవల్క్య మహర్షిని వివాహము చేసికొనిరి. మరొకరు విశ్రవోముని పత్ని. వీని పుత్రుడే లోకపాలుడు కుబేరుడు.

శ్రీరామునకు భరద్వాజునిపై అనన్యానురాగ ముండెను. వనవాస మేగునప్పుడు ప్రయాగయందున్న ఈ ముని ఆశ్రమమందు ఒక రాత్రి నివాసము చేసెను.

శ్రీ భరతుడు శ్రీరాముని తిరిగి తెచ్చు నుద్దేశ్యముతో చిత్ర కూటమునకు వెళ్ళునప్పుడు ఈముని ఆశ్రమమందు ఒక రాత్రి యుండెను. భరద్వాజుడు తన తపోబలముతో సిద్ధుల ప్రభావమున భరతుని వెంట వచ్చిన అయోధ్యావాసులందరికి అద్భుతాతిథ్యమిచ్చి వారిని ఆశ్చర్య చకితులను గావించెను. ఇతడు నిజమైన శ్రీరామ భక్తుడు. అందువలన ఇతనికి భగవానుని భక్తులు. భగవానుని కంటె అధిక ప్రియులు. ఎవరైన భగవద్భక్తుని కలయిక ఆయనకు భగవంతుడు ప్రత్యక్షమగుట కన్న అధిక సుఖదాయకమగును. భరతునితో కలయిక భరద్వాజుని ఎంతయు ఆనందపరచినది.

శ్రీరఘునాధుడు లంకా విజయానంతరము తిరిగి వచ్చునప్పుడు కూడ, పుష్పక విమానము నుండి దిగి భరద్వాజుని దగ్గరకు వెళ్ళెను. శ్రీరాముడు సాకేతధామ ప్రవేశానంతరము భరద్వాజుడు భువన సుందరుని రూపము ధ్యానించుచు వాని గుణములనే మనస్సున తలచుకొనుచుండెను. మాఘ మాసమందు ప్రతి సంవత్సరము ప్రయాగలో ఋషిగణములు మకర స్నానము చేయుదురు. ఒకసారి మాఘమాస స్నానములు పూర్తి అయిన తరువాత ముని గణములు వెళ్ళుచుండ భరద్వాజుడు యాజ్ఞవల్క్య మహర్షిని శ్రీరామ కథ వినిపింపుమని ప్రార్థించి ఆపెను.

యాజ్ఞవల్క్య మహర్షి ప్రసన్నుడై శ్రీరాముని చరిత్రను వర్ణించెను. ఈ విధముగ భరద్వాజుని కృపతో లోకమున శ్రీరాముని చరిత్రమను మంగళ ప్రవాహము ప్రవహించెను.

- (రామచరిత మానసము)

# రఘువంశం



మహాకవి కాళిదాసు
కృతికి భావానువాదం:
డా॥ సముద్రాల లక్ష్మణయ్య,
తిరుపతి

(గత సంచిక తరువాయి)

## ఇందుమతీ స్వయంవరం

లోకాంతరాలకు వ్యాపించిన కీర్తిగలవాడూ, ఆచారంతో పవిత్రమైన ఉభయవంశాలనూ దీపింపజేసినవాడూ, శూరసేన దేశానికి అధిపతీ అయిన సుషేణుడనే రాజును ఆ పిదప ఇందుమతికి చూపి ద్వారపాలిక ఇలా పలికింది -

"ఈ రాజు నీప వంశంలో జన్మించాడు. విధ్యుక్తంగా ఎన్నో యజ్ఞాలు చేశాడు. అన్యోన్య విరోధులైన జంతువులు ప్రశాంతమైన తపోనిధుల ఆశ్రమంలో వైరం మాని ఒద్దికగా వున్నట్లే జ్ఞానం, మౌనం మొదలైన పరస్పర విరుద్ధగుణాలు ఇతణ్ణి ఆశ్రయించి తమ సహజవిద్వేషం వదలిపెట్టాయి. ఈ భూపాలుని శోభ తనవారికి చంద్రకాంతిలాగా కన్నులపండువుకాగా, ప్రచండమైన ఈతని పరాక్రమం శత్రురాజుల శూన్యనగరాలలో భరింపరానిదై మండుతున్నది. ఇతడు జలక్రీడ లాడేటప్పుడు అంతఃపురకాంతల స్తనచందనం కరిగి నీటిలో కలిసిపోవడంవల్ల తెల్లబడిన యమునానది మధురానగరంలోనే గంగానదితో సంగమించిందా అన్నట్లు కనిపిస్తుంది.

పూర్వం గరుత్మంతుడికి భయపడి పారిపోయిన కాళియుడు మధురాపుర పాలకుల అనుమతితో యమునా ప్రవాహంలో తలదాచుకొన్నాడు. అభయమిచ్చిన ఈతని పూర్వులకు కృతజ్ఞతా సూచకంగా ఒక మణిని అతడు సమర్పించుకొన్నాడు. మహోజ్జ్వలమైన వక్షఃస్థలంలో కాంతు లీనుతున్న ఆ మణిని ధరించిన ఈ సుషేణుడు కౌస్తుభధారి అయిన కృష్ణమూర్తిని సిగ్గిలజేయునట్లున్నాడు. సుందరీ ! ఎలప్రాయంలోవున్న ఈ రాజును చేపట్టి కుబేరుని ఉద్యానంతో దీటైన బృందావనంలో మెత్తని చివుళ్లు పరచిన పూబాన్పుమీద యౌవన ఫలాన్ని అనుభవించు. అంతేకాదు. వర్షాకాలంలో నీటిచుక్కలు పడటంవల్ల శిలాజిత్తు తావి యీనుతున్న రాతిబండపై కూర్చొని అందమైన గోవర్ధనగిరి గుహల్లో నృత్యం చేసే నెమళ్ళను చూడు."

సముద్రంవైపు పయనించే నది మార్గమధ్యంలో వచ్చిన కొండను ఎలా తప్పుకొనిపోతుందో, అలాగే నీటి సుడిలా అందమైన పొక్కిలిగల యిందుమతి మరొకని భార్యకానున్నదై ఆ సుషేణమహారాజును దాటుకొని వెళ్లింది.

పిమ్మట సునంద కేయూరాలు ధరించినవాడూ, శత్రువులను నురుమాడినవాడూ, కళింగదేశాధీశ్వరుడూ అయిన హేమాంగదుడనే క్షితిపతిని సమీపించిన ఆ పూర్ణచంద్రముఖితో ఇలా అన్నది -

"ఈ రాజు మహేంద్రగిరితో సమానమైన బలంకలవాడు. ఇతనికి మహేంద్రమే గిరిదుర్గం; మహాసముద్రమే జలదుర్గం. ఇతడు జైత్రయాత్రలు చేసేటప్పుడు ముందు నడిచే సేనాగజ సమూహాన్ని చూస్తే మహేంద్రపర్వతమే ముందు నడుస్తున్నదా అనిపిస్తుంది. విలుకాండ్రలో శ్రేష్ఠుడయిన ఈ బాహుశాలి సవ్యసాచి, అందువల్ల ఈయన రెండు బాహువులమీద ఏర్పడ్డ అల్లెత్రాటిదెబ్బల నల్లగీరలు ఇతడు బలాత్కరించి బందీలుగా పట్టుకొని తెచ్చిన శత్రులక్ష్ముల కాటుక కన్నీటిదారులా అన్నట్లున్నాయి. ఈ భూపాలుని గృహగవాక్షాలనుండి అలలు

కనిపించునంతటి చేరువలోనే సాగరు డున్నాడు. అతడు గంభీరమైన తరంగ ఘోషలతో జాముజామునా మ్రోగే తూర్యధ్వనులతో పనిలేకుండా ఆయనను అనునిత్యమూ నిద్రనుండి మేల్కొలుపుతూ వుంటాడు. ద్వీపాంతరాలనుండి లవంగ కుసుమాలను మోసుకు వచ్చే తెమ్మెరలతో నీచెమటతడి ఆర్చుకొంటూ తాటితోపుల మర్మరధ్వనితో గూడిన అక్కడి సముద్రతీరాలలో ఈ రాకుమారునితో కలిసి హాయిగా విహరించు.''

అందాన్ని అభినందించే ఇందుమతి సునంద అలా తన్ను ప్రోత్సహించి నప్పటికీ ప్రయత్నంతో దవ్వులనుండి కొనివచ్చిన సిరి పుణ్యహీనుడికి దూరమైనట్లు ఆ హేమాంగదుణ్ణి వరించకనే ఆవలికి వెళ్ళిపోయింది.

పిమ్మట సునంద దేవసమానుడైన నాగపురాధీశ్వరుణ్ణి సమీపించి "చకోరాక్షీ! ఇటుచూడు" మంటూ ఇందుమతిని హెచ్చరించి ఇలానుడివింది -

"అంసతలంనుండి హారాలు వ్రేలాడుతూ వుండగా హరిచందనం అంగరాగంగా అలదుకొన్న ఈ పాండ్యరాజు లేత యెండతో ఎర్రబడ్డ చరియలు గలిగి సెలయేళ్ళ జాలులతో విలసిల్లే పర్వతరాజంలా ప్రకాశిస్తున్నాడు. వింధ్యమహాపర్వతాన్ని స్తంభింపజేసినవాడూ, సముద్రపు నీటినంతా త్రాగి ఉమిసినవాడూ ఐన అగస్త్యమహర్షి అశ్వమేధావభృథం పూర్తికాగానే ఈ నరపాలుణ్ణి నీకు సుఖంగా స్నానం అయినదా! అని ప్రశ్నిస్తూ వుంటాడు.

పూర్వం ఇంద్రుణ్ణి జయించాలన్న ఉద్దేశంతో స్వర్గంమీదికి దండెత్తిన రావణాసురుడు దుర్లభమైన బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని శివుని నుండి పొందిన ఈ పాండ్యరాజు ఎక్కడ జనస్థానాన్ని ఆక్రమిస్తాడో అని జంకి ఇతనితో సంధి చేసుకొన్నాడు. రాకుమారీ! మేటివంశానికి చెందిన ఈ మహారాజును యథావిధిగా పెండ్లాడి నీవు గొప్పదయిన భూదేవిలాగా రత్నాకరమే ఒడ్డాణముగా గల దక్షిణదిక్కుకు సవతివి కమ్ము. తములపు తీగలు చుట్టుకొన్న పోకచెట్లు, ఏలకి తీగ లల్లుకొన్న గంధపుమ్రాకులు, తమాలపత్రపు పఱపులు గల అక్కడి మలయపర్వత స్థలాలలో తఱచుగా క్రీడించటానికి సమ్మతించు. ఈ రాజు నల్లగలువవలె చామనచాయవాడు. నీవు గోరోచనంలా పచ్చనిదానవు. మీయిరువురి కలయిక మేఘము, మెఱుపు కలయిక లాగా పరస్పర శోభను ఇనుమడింపజేస్తుంది.''

సూర్యదర్శనం లేకపోవడంవల్ల ముడుచుకొన్న పద్మంలోకి చంద్రకిరణం ప్రవేశించనట్లే సునంద చేసిన ఉపదేశం ఇందుమతి మనస్సులో దూరలేదు.

దీవజ్వాల రాజవీథిలో ముందుకు సాగిపోతున్నప్పుడు వెనుకబడిన కోటబురుజు చీకటిలో మునిగినట్లే స్వయంవర మండపంలో ఇందుమతి ఏయేరాజును దాటివెళ్లిందో ఆ రాజు తన ముఖవికాసం కోల్పోయాడు.

అజమహారాజు కూడా ఇందుమతి తన చెంతకు రాగానే తన్నామె వరిస్తుందో లేదో అని సంశయించాడు. ఇంతలో శుభసూచకంగా కేయూరబంధానికి నెలవైన కుడిభుజం అదిరేసరికి ఆయన సంశయం తొలగిపోయింది.

సర్వావయవ శోభితుడయిన అజుణ్ణి సమీపించి ఇందుమతి మరొకని వద్దకు వెళ్లాలనే తలంపు వదలుకొన్నది. నిండారా వికసించిన తియ్య మామిడిచెట్టును చేరిన తుమ్మెదలబారు మరొక చెట్టును కోరదుగదా! చంద్రుని వంటి కాంతి గలదీ, అజునిపై మనసుంచినదీ అయిన ఇందుమతిని చూచి మాటల పొందిక తెలిసిన సునంద ఇలా అన్నది -

''పూర్వం ఇక్ష్వాకువంశంలో మహాగుణవంతుడయిన 'కకుత్థ్సుడు' అనే

రాజశ్రేష్ఠుడొక డుండేవాడు. ఆయన సంతతికి చెందిన ఉత్తర కోసల రాజులందరూ ఔన్నత్యం కోరి సుప్రసిద్ధమైన కాకుత్థ్సనామం వహిస్తున్నారు. నందివాహను డయిన శివునిలా ఆ కకుత్థ్సుడు ఆబోతురూపం దాల్చిన మహేంద్రుణ్ణి అధిష్ఠించి శరప్రయోగంతో అసురాంగనల చెక్కిళ్ళమీది మకరికాపత్రాలను చెఱిపివేశాడు. అంతేకాదు. ఆయన ఐరావతి గజాస్ఫాలనం వల్ల సడలిన బాహుపురి గలవాడూ, నిజరూపధారీ అయిన దేవేంద్రుని బాహుపురితో తన బాహుపురిని ఒరసికొంటూ అతని అర్థాసనం అధిష్ఠించాడు.

ఆ కకుత్థ్సునివంశంలో గొప్ప కీర్తిమంతుడూ, కులదీపకుడూ అయిన దిలీపుడనే మహారాజు జన్మించాడు. ఆనరేంద్రుడు తొంబైతొమ్మిది యాగాలు చేసి నూరవ యాగాన్ని ఇంద్రుని ప్రీతికొరకై మానివేశాడు. ఆ ధర్మాత్ముని పరిపాలనలో విహారార్థం వెళుతూ నడిదారిలో పైకెక్కి నిద్రించిన చెలువల వలువలను గాలికూడా కదిలించేది కాదు. ఇక అతని యేలుబడిలో దొంగతనానికి పాల్పడేవాడెవడు?

ఇప్పుడు ఆ దిలీపుని రాజ్యాన్ని అతని కుమారుడయిన రఘుమహారాజు ఏలుతున్నాడు. నేలనాలుగు చెరగులనుండీ తెచ్చిన ధనరాసులన్నీ ఆయన విశ్వజిద్యాగంలో దక్షిణగా సమర్పించి మట్టిముంతతో మిగిలిపోయాడు. అనంతమయిన ఆ రఘుమహారాజు కీర్తి కొండలెక్కింది. సముద్రాలు దాటింది. పాతాళం ప్రవేశించింది. ఊర్ధ్వలోకాలకు ఎగబ్రాకింది. అది యీ పాటిదని చెప్పశక్యంకాదు.

దేవేంద్రునికి జయంతునిలా ఆ రఘు మహారాజుకు ఈ అజమహారాజనే కుమారుడు జన్మించాడు. ఈయన ఇంకా శిక్షణ అందుకొనే దశలోనే ఉన్నా తండ్రితోపాటు తానుగూడా మహాభూభారం వహిస్తున్నాడు. కులం, రూపం, నవయౌవనం, వినయాది సకలగుణాలు, ఇన్నిటితో నీకు అన్ని విధాలా తగిన ఈ రాకుమారుణ్ణి వరించు. రత్నం సువర్ణంతో జతగూడి వెలుగొందుగాక!"

సునంద మాటలు పూర్తికాగానే ఇందుమతి సిగ్గు కొంచెం తొలగించుకొని స్వయంవర మాలికతోవలె ప్రసాదనిర్మలమైన దృష్టితో ఆ రాకుమారుణ్ణి అంగీకరించింది ఆమె ఆ తరుణునిపై తనకు గల అనురాగాన్ని దిట్ట కానందువల్ల చెప్పలేకపోయింది. అయినా ఆ ప్రేమ పులకలమిషతో ఆ కుటిలకుంతల శరీరంనుండి వెలికి వచ్చింది.

ఇందుమతి అలా అయ్యేసరికి ఆమె వాలకం గమనించిన సునంద ఎగతాళిగా "అమ్మా! మరొక రాజుచెంతకు పోదాం, పద" అని అన్నది. అందుకామె సునందను అసూయతో కుటిలంగా చూచింది. పిమ్మట రాకుమారి కుంకుమ పొడితో ఎర్రనైన సంవరణమాలికను మూర్తీభవించిన అనురాగాన్ని సునందచేతుల మీదుగా రఘునందనుని కంఠానికి తగిలింపజేసింది.

తన వెడదఱొమ్మున వ్రేలాడే ఆ మంగళ పుష్పమాలికను చూచుకొని వరణీయుడయిన అజమహారాజు ఇందుమతి బాహుపాశాలతో తన మెడను కౌగిలించికొని వ్రేలాడుతున్నట్లుగా భావించాడు. వారిద్దరి కలయికకూ మెచ్చిన పురజనులు "వెన్నెల మబ్బు విడిచిన శరచ్చంద్రుణ్ణి పొందింది., గంగానది అనురూపుడయిన సముద్రుణ్ణి చేరింది" అని ఒకేమాటగా అన్నారు. ఆ మాట ఇతర రాజుల చెవులకు చేదుగా వుండింది.

ఒక ప్రక్క వరుని పక్షానికి చెందిన రాజలోకం ఎంతో సంతోషిస్తే, మరో ప్రక్క తక్కిన రాజవర్గమంతా ముఖం ముడుచుకుంది. ఆ దృశ్యం ఉషఃకాలంలో ఒకప్రక్క వికసించిన పద్మాలతోనూ, మరొకప్రక్క ముకులించిన కలువలతోనూ కూడిన మడువులా కనిపించింది.

×××

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు



## పింజరికొండ (తూర్పు గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్)

శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

పింజరి కొండ ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడకు 90 కి.మీ., రాజమండ్రికి 80కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ పింజరికొండ జలపాతం ఉంది.

ఏలేశ్వరం ఏలేరు ప్రాజెక్టు దాటిన తరువాత ప్రారంభమయ్యే అటవీ ప్రాంతంలో గిరిజన గ్రామాలమీదుగా ప్రయాణం సాగుతుంది. ఈ ప్రయాణంలో ఏలేశ్వరం దాటిన తరువాత ప్రారంభమయ్యే అటవీ ప్రాంతలో పచ్చని చెట్లు, పెద్ద పెద్ద లోయలు, జలపాతాలు, సెలయేర్లు, పక్షుల కిలకిలారావాలు దారి పొడవునా పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి.

ఎత్తయిన దుమ్ముకొండ లోయల్లోంచి ఎన్నో మైళ్ళదూరం ప్రవహించే సెలయేరు పింజరి కొండ వద్ద ఉత్తరం నుండి దక్షిణానికి ప్రవహిస్తూ తూర్పు దిశకు మళ్ళుతుంది. దారి మళ్ళిన ప్రవాహం బండరాళ్లను ఒరుసుకుంటూ జలపాతమై ఉరుకుతుంది. ఈ సెలయేటికి అవతలి పక్క పింజరికొండ గ్రామం ఉంది.

పింజరి కొండ ప్రకృతి అందాలే కాకుండా నీటి మడుగులోవున్న శివాలయం వల్ల ప్రసిద్ధి పొందింది. కొండల దిగువున వందలాది సంవత్సరాల క్రితం నిర్మించిన శివాలయం, శివలింగం ఉండేవని ఈ ఆలయం ప్రక్క నుండి సెలయేరు ప్రవహించేదని, ఈ శివాలయంలో నిత్యపూజలు జరిగేవని, శివరాత్రికి రెండు రోజులు ఉత్సవాలు జరుపుకుంటూ గిరిజన సంప్రదాయ నృత్యగానాలతో తెల్లవార్లు జాగరణ చేసేవారని తమ పెద్దలు చెప్పినట్లు ఇక్కడి గిరిజనులు చెబుతారు. కాలగమనంలో ప్రవాహ ఉధృతికి ఈ సెలయేరు ప్రవాహదారి గాడితప్పి కొండ దిగువున ఉన్న శివాలయం మీదుగా ప్రవహించడం వలన ప్రస్తుతం శివాలయం నీటి మడుగులో ఉందని భావిస్తున్నారు.

ఈ ప్రాంత గిరిజనులు నేటికీ మహాశివరాత్రికి రెండు రోజులు ఉత్సవాలు జరుపుతున్నారు. వేలాది మంది గిరిజనులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు.

ప్రతి ఆదివారం, సెలవు రోజుల్లో అనేక మంది పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు.

కార్తీక మాసం నెలరోజులూ యాత్రికులతో ఈ పింజరికొండ కళకళలాడుతుంది.

కొండలు, దట్టమైన చెట్లు, సెలయేటి గలగల సంగీత రవళులమధ్య పింజరి కొండ సుందర దృశ్యాలు పర్యాటకులకు నయనానందంతోపాటు, శ్రవణానందాన్ని కూడ కలుగజేస్తాయి. అనడంలో ఏమాత్రం సందేహంలేదు.

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

(గత సంచిక తరువాయి)

## 5.2. గో జననం

- పూర్వం బ్రహ్మదేవుడు దక్షప్రజాపతిని చూచి ప్రజలను సృష్టించమని ఆజ్ఞాపించాడు. ప్రజాపతి ముందుగా ఆహారపదార్థములను సృష్టించుటకై అమృతమును పానము చేసినాడు. అమృతములోని పరిమళమునకు తృప్తి నొంది త్రేపు వచ్చినది. ఆ త్రేపు నుండియే గోముఖియగు పుత్రిక జన్మించినది. అలా గోవులు అమృతమునుండి పుట్టినవి. గావున గోక్షీరమునకు అమృత గుణములు కలవు. ఒకప్పుడు పాలు త్రాగుచున్న వత్సముల ముఖము నందు అంటియున్న నురుగు తపస్సు చేయుచున్న శివునిపై పడినది. ఆగ్రహించిన శివుని కోపాగ్నికి కొన్ని గోవులు నల్లనైనవి. అలా నల్లనైన గోవులే కపిల గోవులు అంటారు. (నలుపు, తెలుపు, ఎరుపు కాని రంగు కపిలము). ఇంతలో ప్రజాపతి పరుగున వచ్చి రుద్రునితో గోవత్సముల నుండి వచ్చిన నురుగు ఎంగిలి కాదని అది అమృత సమానమని గోవులను అనుగ్రహించమని వేడుకున్నాడు. దానికి శివుడు సంతృప్తి చెంది అనుగ్రహించి వాటికి పవిత్రత చేకూరునట్లు వరమిచ్చాడు. ఈ సందర్భముగా దక్షప్రజాపతి శివునకు ఒక వృషభము కానుకగా ఇచ్చాడు. ఆ వృషభమునే పరమేశ్వరుడు వాహనముగా చేసుకున్నాడు.

పూర్వము ప్రజలు గోవులను విశేషముగా పెంచి, పోషించి, గోసంపద ద్వారా సుఖశాంతులతో వర్థిల్లుటకు ప్రధాన ఆర్థిక వనరుగా జీవనము సాగించుచుండెడి వారని తెలియుచున్నది. రాజులు, ధనికులు విశేషముగా గోదానము చేసెడివారు. దీనితో అన్ని వర్గముల ప్రజలు - బ్రాహ్మణులు, శూద్రులు, వైశ్యులు సుఖశాంతులతో యజ్ఞయాగాదులు చేస్తూ సుఖముగా జీవించుచుండెడి వారని తెలియుచున్నది.

అందుకే భీష్ముడు ధర్మరాజుకు ధర్మప్రబోధము చేయునప్పుడు అన్ని దానములకంటె గోదానము గొప్పదని చెప్పియున్నారు. గోదానము చేయుటకు కొన్ని నియమనిబంధనలు కూడా ఏర్పరచియున్నారు.

- గోదానము చేసిన వారు మరణానంతరము విష్ణులోకములో శాశ్వతముగా ఉందురని గరుడ పురాణములో చెప్పబడినది.

- గోవులకింత పవిత్రత వున్నందువలననే శ్రీ మహాలక్ష్మిదేవి కూడా గోవుల వద్ద నుండుటకు బ్రతిమాలుకుని గోవుల మూత్రపురీషములందు ఉండుటకు అంగీకరించినది. కావుననే పంచగవ్యములందు మూత్రపురీషములు కూడా చేరియున్నవి.

- మానవుని మరణ సమయమున / అవసానదశలో గోమేధముతో భూమిని అలికి, దానిపై తిలలు, దర్భలు పరచి అందు పరుండబెట్టిన ఆ జీవుని దగ్గరకు భూతప్రేతములుగాని, యమదూతలుగాని రారని ఆ జీవుడు విష్ణులోకమునకు వెళ్ళునని గరుడ పురాణములో చెప్పబడినది.

-శుభకార్యములకు బయలుదేరునప్పుడు గోప్రదక్షిణము చేసి గోవు పృష్ఠ భాగమును స్పృశించి నమస్కరించినచో ఆ కార్యములు సఫలీకృతములగును.

# వాస్తు- సైన్సు

.... ఆళ్ళ రామకృష్ణ, రాజేంద్రనగర్, గుంటూరు. 9492464366

పొడవుగా వుండే పెద్ద నిర్మాణాలు (శాలలు) ఎన్ని రకాలుగా వుంటాయో తెలుసుకున్నాం. ఇప్పుడు వాటి నిర్మాణాన్ని చేపట్టేటప్పుడు మనం పాటించవలసిన నియమాలేంటో చూద్దాం.

**ఏకశాల** 1) అపార్టుమెంటులు లేదా గదులు బేసి సంఖ్యలో వుండాలి.

2) అన్ని గదులు / అపార్టుమెంటుల వైశాల్యము సమానముగా వుండాలి.

3) గదులు బేసి సంఖ్యలో వుండాలి అని చెప్పటానికి ముఖ్య కారణం ఏమిటంటే, ఆ విధంగా నిర్మాణం చేపట్టినప్పుడు, శాల యొక్క మధ్య గది గర్భం అవుతుంది. అంటే ఏకశాల యొక్క బ్రహ్మస్థానంలో (బ్రహ్మస్థానం అనగా సరిగా మధ్య ప్రదేశము) గది వస్తుంది.

4) సరిసంఖ్యలో వేసినట్లయితే ఏకశాలలో బ్రహ్మస్థానంలో పిల్లర్ లేదా గోడ వస్తుంది. అది వాస్తు విరుద్ధము. కట్టడం యొక్క వాస్తు బలాన్ని తగ్గిస్తుంది.

5) ఖాళీస్థలం మరియు మిగతా నియమాలన్నీ అన్ని గృహాలకు వర్తించినట్లే వర్తిస్తాయి.

6) ఏకశాలలను అంతస్థులుగా కూడా వేసికోవచ్చును. అన్ని అంతస్థులలోను గదులు ఒకే ఆకారములో వుంటే మంచిది.

చిన్న చిన్న మార్పులు ఉన్నా ఇబ్బంది లేదు. ఏకశాల వాస్తు ప్రకారం మంచి నిర్మాణ ప్రక్రియ

**తూర్పు పడమరలో ఏకశాల** : పడమర నుంచి తూర్పుకు పెరుగుతూ వేసే ఏకశాల. దీనిని దక్షిణపు ప్రహరీకి సమాంతరంగా, దక్షిణ ప్రహరీలో దగ్గరగా వేయాలి. అంటే దక్షిణంలో కంటే ఉత్తరంలో ఎక్కువ ఖాళీ స్థలం ఉండేటట్లు చేయాలి.

**ఉత్తర దక్షిణాల ఏకశాల** : అంటే దక్షిణం నుండి ఉత్తరం పెరుగుతూ వేసే ఏకశాల. దీనిని పడమర ప్రహరీకి సమాంతరంగా, పడమర ప్రహరీకి దగ్గరగా వేయాలి. అంటే పడమర కంటే తూర్పులో ఎక్కువ ఖాళీస్థలం ఉండేటట్లుగా చూడాలి.

**అనేక ఏకశాలలను వేయునపుడు తీసుకొనవలసిన జాగ్రత్తలు** : 1) ఏకశాలలు ఎక్కువ సంఖ్యలో వేసేటప్పుడు, ఒకదానికొకటి సమాంతరంగా పడమర నుండి తూర్పునకు గాని, దక్షిణము నుండి ఉత్తరమునకు గాని వేసికుంటూపోవాలి.

2. రెండు ఏకశాలలను నమాంతరంగా వేసేటప్పుడు ఒకదానిని పడమర గోడకు సమాంతరంగాను, మరియొక దానిని తూర్పు గోడకు సమాంతరంగాను వేసికోవాలి.

3. అడ్డదిడ్డంగా శాలల నిర్మాణం వేయరాదు.

4. ప్రతి శాల యొక్క పిల్లర్లు మరియు కప్పులు ఒకే ఎత్తులో వేసుకోవాలి. లేదా పడమర నుండి తూర్పుకు వెళ్ళేకొద్దీ, మొదటి శాలకన్నా రెండవశాల, దానికన్నా మూడవశాల ఎత్తు తక్కువ వచ్చే విధంగా వేసికోవాలి. అదే రకంగా, దక్షిణం నుండి ఉత్తరం వైపుకు తగ్గుతూ వుండాలి.

5. ప్రతిశాల యొక్క పిల్లర్లు మరియు గోడలు ప్రక్కనవున్న ఏకశాల గోడకు, పిల్లర్లకు పారులో వుండాలి.

6. 'T' ఆకారంలో ఒకదానికొకటి పోటీ ఈ అయ్యేటట్లుగా ఏకశాలలు ఎప్పుడూ వేయరాదు.

**ద్విశాల** : ఇది ఎక్కువగా 'L' ఆకారములో

వుంటుంది. కొంతమంది 'V' ఆకారంలో కూడ కట్టడం జరుగుతుంది ఈశాన్యం పెరిగిన ద్విశాలలు తప్ప, అన్నీ వాస్తు దోషంతోనే వుంటాయి.

**నియమాలు** : 1. ఒక నిర్మాణం దీర్ఘచతురస్రాకారంగా లేదా చతురస్రాకారంగావుండాలన్న నియమం ద్విశాలలకు వర్తించదు. దీనికి కారణం, ద్విశాలలోని గదులు, అపార్టుమెంటులు వేటికది విడిగా వుంటాయి.

2. ఆ గదులు లేదా అపార్టుమెంటులను కలుపుతూ ద్వారాలు వుండవు. ఒకవేళ ఆ గదులు లేదా అపార్టుమెంటులను కలుపుతూ, ద్వారాలు ఉండేటట్లయితే, ద్విశాల నిర్మాణం చేపట్టరాదు.

3. ద్విశాలలు వేసేటప్పుడు, ద్విశాలలోని రెండు శాలలు విడివిడి భవనాలు అనుకొని, ఆయా భవనాలకు పడమర దక్షిణాల్లో ఎంత ఖాళీ వుంటుందో, తూర్పు ఉత్తరాల్లో అంతకంటే ఎక్కువ ఖాళీ వుంచాలి.

4. ద్విశాలలోపైన అంతస్థులు వేసేటప్పుడు పడమర లేదా దక్షిణంలో ముందుగా అంతస్తులువేసి, ఆ తరువాత మాత్రమే తూర్పు ఉత్తరాలలో అంతస్తులు వేయాలి.

**త్రిశాల** : త్రిశాలలు 'U' ఆకారంలో వుంటాయి.

త్రిశాలల్లో మూడు శాలలను విడివిడి భవనాలుగా లెక్కించి, దేనికి దానికి ప్రతిశాలకు పడమర కంటే తూర్పులో ఎక్కువ ఖాళీ, దక్షిణం కంటే ఉత్తరంలో ఎక్కువ ఖాళీ ఉండేటట్లు చూసుకోవాలి.

**చతుశ్శాల** : వాస్తు ప్రకారము చతుశ్శాల చాల మంచి నిర్మాణము. ఇందులోని నాలుగు శాలలు కూడ నాలుగు దిక్కులకు సమాంతరంగా వుండాలి. దిక్మూఢం వుండకూడదు. పూర్వకాలంలో నిర్మించబడిన మండువా లోగిళ్ళు అన్నీ చతుశ్శాలలే.

**నియమాలు మరియు జాగ్రత్తలు** : 1. చతుశ్శాలలో మధ్యలో వున్న ఖాళీస్థలంపైన అవసరంవున్నట్లయితే కప్పువేసికోవచ్చు. కప్పులేక పోవడం మరింత మంచిది. గాలి, వెలుతురు పుష్కలంగా లభిస్తుంది.

2. మధ్యలోని ఖాళీస్థల నేలమట్టం, చతుశ్శాల బయటి నేలమట్టంతోపాటుగా (సమానంగా)గాని లేదా ఎత్తుగా గాని వుండాలి.

3. మధ్య ప్రదేశం బ్రహ్మస్థానం కనుక తక్కువగా వుండరాదు. శాలల నేలమట్టం కన్నా ఎత్తు మాత్రం వుండరాదు.

4. ఖాళీస్తలం విషయానికొస్తే, చతుశ్శాలల బయట దక్షిణం కన్న ఉత్తరం, పడమరకన్నా తూర్పు ఎక్కువ ఖాళీ స్థలాలుండాలి.

5. చతుశ్శాలల నిర్మాణం చేపట్టినపుడు, ఎప్పుడూ పడమరలో మరియు దక్షిణంలో శాలలువేసి, ఆ తరువాత తూర్పు ఉత్తరాల శాలల నిర్మాణం ప్రారంభించాలి.

6. ఎక్కువ అంతస్తులు వేసేటప్పుడు, పడమర, దక్షిణాలలో అంతస్తులు వేసిన తరువాతే, తూర్పు ఉత్తరాలలో అంతస్తుల నిర్మాణం చేపట్టాలి.

**గమనిక :**

1. శాలల నిర్మాణం చేయునపుడు, తప్పనిసరిగా మంచివాస్తు పండితుని సలహాతో చేసికోవాలి. లేని యెడల చాల కష్టనష్టాలను ఎదుర్కొనవలసి వస్తుంది.

2. 'T' ఆకారంలో మరియు '+'ఆకారంలో నున్న శాలలు పూర్తిగా వాస్తు విరుద్ధమైనవి.

- పురాతన కాలంలో '+' ఆకారంలో నిర్మింపబడిన దేవాలయాలు, వాటి వైభవాన్ని కోల్పోయి, జీర్ణావస్థకు వచ్చి ప్రస్తుతం పర్యాటక కేంద్రాలుగా మాత్రమే పరిగణింపబడుతున్నాయి.

- శాలలు అంటేనే ఎక్కువ మంది ప్రజానీకానికి సంబంధించినవి కావున వాటి వాస్తు ప్రభావము ఒక రకంగా ప్రజా జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. కనుక వీటి నిర్మాణ విషయంలో జాగరూకతతో వ్యవహరించాలి. □